ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 16.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 327 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నో షేక్ హ్యాండ్! 8

సూపర్ భారత్.. పాకిస్తాన్‌పై ఘన విజయం

- ప్రపంచకప్‌లో రికార్డు విజయం
- ఇషాన్ కిషన్ విజృంభణ
- చెలరేగిన బౌలర్లు
- సూపర్-8కు టీమ్ఇండియా

టీ20 ప్రపంచకప్‌లో భారత్ సూపర్ ప్రదర్శననిచ్చింది! ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విరుచుకుపడింది. టీమ్ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ రికార్డును కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి.. మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్8 కు చేరింది. ఇషాన్ కిషన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ టీమ్ఇండియా సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరించింది.

...:: వివరాలు 8లో

రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండొద్దా?

గెలిచిన ఒక్క మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ లాక్కుంది

- వెగటు రాజకీయాలు చేసిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది
- కాంగ్రెస్‌కు తప్పకుండా ప్రజలే బుద్ధి చెబుతారు:
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 15: గెలిచిన ఒక్క మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ లాక్కుంది. వెగటు రాజకీయాలు చేసిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకల్లో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ "మేము గెలిచిన ఒక్క మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ పార్టీ లాక్కున్నది. ఈ వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. రాష్ట్రంలో అడిగేవాళ్లు, ప్రతిపక్షం ఉండొద్దా? కాంగ్రెస్‌కు తప్పకుండా ప్రజలే బుద్ధి చెబుతారు" అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. శివరాత్రి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆమె, సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాకుండా సంఘ సంస్కర్త కూడా అని కొనియాడారు. బ్రిటీష్ కాలంలో గిరిజనులను క్రిమినల్ ట్రైబ్స్‌గా ముద్రవేసినప్పుడు ఖడ్గం ఎత్తి పోరాడిన మహనీయుడని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా బంజారా జాతి మేలు కోసం కృషి చేసిన ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. గోర్ భోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. జీవో 33 ప్రకారం బంజారాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేసిన కవిత, గత రెండేళ్లలో అడ్మిషన్లు, ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఆ రిజర్వేషన్లు అమలు చేశారా అంటూ శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తండాలకు ఒక్కోటి రూ.25 లక్షలు కేటాయించాలని, రేషన్ షాపులు, గ్రామపంచాయితీలు, అంగన్‌వాడీలు ఏర్పాటు చేయాలని కోరారు. పోడు పట్టాల పంపిణీ వెంటనే చేపట్టాలని, అసైన్డ్ భూముల విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేవాలాల్, ఆదివాసీలు, ఎరుకల తెగ పేరుతో ప్రకటించిన మూడు కార్పొరేషన్లు వెంటనే ఏర్పాటు చేయాలని, నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో

...:: మిగతా 2లో

> తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. వెనుకబాటు తనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు.

పాలకులం కాదు సేవకులం

- నేను ఎప్పుడూ పాలకుడిగా ప్రవర్తించలేదు
- సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా
- తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిది
- సీఎం రేవంత్,వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.
- 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రవ
- సేవాలాల్ జయంతి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 15: 'తాము పాలకులం కాదు సేవకులం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని, తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి

...:: మిగతా 2లో

నల్లమలలో బంజారాల మహా పుణ్యక్షేత్రం

- 20 ఎకరాల్లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ దేవాలయం
- వచ్చే జయంతి ఉత్సవాలు అక్కడే

కరీంనగర్ మేయర్ పీఠంపై పోరు

- క్షణం క్షణం హైటెన్షన్... అందరి చూపు కరీంనగర్ వైపే
- కాంగ్రెస్ ఖాతాలోకి మేయర్ కుర్చీ!
- మేయర్ పీఠం కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైట్

కాంగ్రెస్
33 కార్పొరేటర్లు
2 ఎక్స్ అఫీషియో మద్దతుతో 35

బీజేపీ
33 కార్పొరేటర్లు
1 ఎక్స్ అఫీషియో మద్దతుతో 34

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

ఫిబ్రవరి 15: కరీంనగర్ నగర రాజకీయాలు ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారాయి. మేయర్ పీఠం కోసం సాగుతున్న రాజకీయ పోరు రోజురోజుకు వేడెక్కుతోంది. సాయి జ్యోతి కాంగ్రెస్ శిబిరంలో చేరడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పటివరకు సమాన బలాబలాలతో ఉన్న కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరు ఇప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యుల చేతుల్లోకి వెళ్లింది. నగర ప్రజల దృష్టి అంతా సోమవారం జరిగే మేయర్ ఎన్నికలపై కేంద్రీకృతమైంది. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 66 మంది ఎన్నికైన కార్పొరేటర్లు ఉన్నారు. సాయి జ్యోతి చేరికతో కాంగ్రెస్ బలం 33కి చేరగా, బీజేపీ కూడా 33 స్థానాలతో సమానంగా నిలిచింది. దీంతో ఎవరికి స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో మేయర్ పీఠం కోసం గట్టి పోటీ నెలకొంది. ఈ పరిస్థితిలో ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. నగర రాజకీయాల్లో ఇప్పటివరకు ఎప్పుడూ లేనంత ఉత్కంఠ నెలకొంది.

ఎక్స్ అఫీషియో సభ్యులే 'కింగ్ మేకర్స్'

కరీంనగర్ కార్పొరేషన్‌కు ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. వారు:బండి సంజయ్ కుమార్ - కరీంనగర్ ఎంపీ, గంగుల కమలాకర్ - కరీంనగర్ ఎమ్మెల్యే, కవ్వంపల్లి సత్యనారాయణ - మానకొండూరు ఎమ్మెల్యే ఈ ముగ్గురు సభ్యుల ఓట్లు ఇప్పుడు ఫలితాన్ని నిర్ణయించబోతున్నాయి. రాజకీయ వర్గాల లెక్కల ప్రకారం ఇద్దరు బీజేపీకి, ఒకరు కాంగ్రెస్‌కు చెందినవారైనా, అధికార పరిస్థితుల దృష్ట్యా తుది నిర్ణయం కీలకంగా మారింది.

మ్యాజిక్ ఫిగర్ 35 – లెక్కల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

మేయర్ పీఠం దక్కించుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 35 అవసరం. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం సంఖ్య 69కి చేరింది. ఈ లెక్కల ప్రకారం కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యం కనిపిస్తోంది. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే మేయర్ పీఠం కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లే అవకాశాలు బలంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ రెండు పార్టీలూ మేయర్ పీఠం కోసం గట్టి వ్యూహాలు రచిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం

...:: మిగతా 2లో

బంజారాలకు మరింత అండగా నిలబడతాం

- గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 15: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. లంబాడా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసింది కేసీఆర్ అని చెప్పారు. 3,146 కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు 3,146 మంది గిరిజన బిడ్డలు సర్పంచ్‌లు అయ్యారని తెలిపారు. గిరిజన తండాల్లో

...:: మిగతా 2లో

క్షీణించిన ఇమ్రాన్ ఆరోగ్యం, ఆస్పత్రికి తరలింపు

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలుస్తోంది. ఆయనను జైలు అధికారులు దగ్గర్లోని ఒక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన లేనప్పటికీ.. పీటీఐ పార్టీ నేతలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.

7

దేశ ప్రయోజనాల కోసమే ఇంధన విధానం

రష్యా నుంచి చమురు దిగుమతులపై భారత్ వైఖరిని ఆయన ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు. తమ ఇంధన విధానం దేశ ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుందని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు.

7



తారిఖ్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బంగ్లాదేశ్ వెళ్లనున్నారు. అక్కడ ఈ నెల 17న బంగ్లా ప్రధానిగా తారిఖ్ రహమాన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఓం బిర్లా దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారు.

7

పొత్తుల్లేవ్.. సొంతంగా గెలుస్తాం

రానున్న ఎన్నికల్లో రెండు ప్రధాన జాతీయ కూటములైన ఎన్డీయే, యూపీయేతో పొత్తు పెట్టుకోబోమని, స్వతంత్రంగానే ఎన్నికల్లో పోటీ చేస్తామని టీవీకే పార్టీ చీఫ్ విజయ్ ప్రకటించారు.

7

రాష్ట్రీయం

హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పొట్లపల్లి రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

ప్రతిపక్షం,హుస్నాబాద్, ఫిబ్రవరి 15: వచ్చే శివరాత్రి నాటికి గౌరవెల్లి ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసుకుని, కాలువల ద్వారా సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆ శివయ్య ఆశీస్సులతో ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలని కోరుకున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని పొట్లపల్లి గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ రాజరాజేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండొద్దా?

మొదటిపేజీ తరువాయి

ఐటీడీఏలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకోలేదని, విద్యాజ్యోతి పేరుతో విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బంజారాలకు కేవలం ఐదు సీట్లు ఇస్తామని చెప్పడం అన్యాయమని, 2011 జనాభా లెక్కలతో పోల్చడం సరికాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో లంబాడీ వర్గానికి మంత్రి పదవి ఇవ్వలేదని, వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అచ్చంపేట అడవుల్లో సేవాలాల్ స్మారకం నిర్మిస్తామని చెప్పడమే కాకుండా హైదరాబాద్‌లో కూడా సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. బంజారాలు, ఆదివాసీల మధ్య విభేదాలు రేపే రాజకీయాలు ఆపాలని ముఖ్యమంత్రిని కోరిన కవిత, స్వాభిమానం అంటే సాంస్కృతిక ప్రతీకలు రాజధానిలో ఉండాలని అన్నారు. బంజారా, ఆదివాసీ హక్కుల కోసం జాగృతి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేస్తూ, సేవాలాల్ సందేశం ప్రకారం సమాజంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భోజుమహారాజు, భిక్షు మహారాజ్, శివరాజ్ మహారాజ్ తదితర బంజారా ఆధ్యాత్మిక గురువులు, జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ పాల్గొన్నారు.

బంజారాలకు మరింత అండగా నిలబడతాం

మొదటిపేజీ తరువాయి

ఇంటింటికీ నీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. నాలుగున్నర లక్షల ఎకరాలకు కేసీఆర్ ఒకే రోజు పోడు పట్టాలిచ్చారని అన్నారు. గిరిజన బిడ్డల విద్య కోసం వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే అని కేటీఆర్ స్పష్టం చేశారు. గిరిజన వ్యాపారవేత్తలకు సీఎంఎస్‌టీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ తీసుకొచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ సబ్సిడీ ఇచ్చామని అన్నారు. బంజారా బిడ్డలకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చామని అన్నారు. ప్రతి జిల్లాలో బంజారా భవన్‌కు స్థలం ఇచ్చామని, బంజారా భవన్‌లు కట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో బంజారాలకు మరింత అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చిన చోట అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తుందని మండిపడ్డారు. పోలీసులతో కలిసి బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆ అరాచకాలను మా కార్యకర్తలు దీటుగా ఎదుర్కొంటున్నారని తెలిపారు.

బీజేపీతో కార్పొరేటర్ల సంప్రదింపులు

- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 15: కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈరోజు హైదరాబాద్ కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్ బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్ కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్ లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్ లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం... రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం...వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

“

యాక్టర్‌గా ఉండటమంటే సన్యాసిగా జీవించడం లాంటిదే. తిండి, నిద్ర వదులుకోవాలి, ఫోకస్డ్‌గా ఉండాలి. నాకు పీఆర్ టీమ్ లేదు. నాపై వచ్చిన రూమర్స్ ఫ్రీ పబ్లిసిటీ తెచ్చిపెట్టాయి. ₹10 కోట్లు పెట్టినా ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. రూమర్స్‌ను పట్టించుకుంటే కెరీర్‌పై ఫోకస్ చేయలేను.

- హీరోయిన్ మృణాల్ ఠాకూర్

పాలకులం కాదు సేవకులం

మొదటిపేజీ తరువాయి

అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో ఆదివారం జరిగిన జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిది

తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ లో కిలో సన్నబియ్యం ధర రూ.45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం భూములు లేవని, కానీ ప్రజలకు సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. చదువు వల్ల కీలక పదవులు వస్తాయన్న ఆయన, చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలురకు 100, బాలికలకు 200 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాను చేయించిన సర్వేలో ఆస్తుల వల్ల కాదు, చదువు లేకపోవడం వల్ల పేదరికం వచ్చినట్లు తేలిందన్నారు. వెనుకబాటుతనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారని మండిపడ్డారు.

లంబాడీలకు గౌరవం – సముచిత స్థానం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్ర మరువలేనిదని సీఎం గుర్తుచేశారు. వారికి సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వంలో గౌరవప్రదమైన స్థానం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్, ఎంపీ బలరామ్ నాయక్, ప్రభుత్వ విప్ శ్రీ జాటోత్ రామచంద్ర నాయక్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర రెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు డా. వేమూరి సముజ్వల, చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్, జీసీసీ జీఎం ప్రతాప్ రెడ్డి, గిరిజన మ్యూజియం క్యురేటర్ డా. ద్యావనపల్లి సత్యనారాయణ తదితర ఉన్నత అధికారులు, లంబాడీ కళాకారులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.నల్లమలలో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్ర నిర్మాణ ప్రకటనతో బంజారా సమాజంలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం గిరిజనుల ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నల్లమలలో బంజారాల మహా పుణ్యక్షేత్రం

నల్లమల అటవీ ప్రాంతంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్‌మహారాజ్‌పుణ్యక్షేత్రాన్ని అత్యద్భుతంగా నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించుకునేలా, గిరిజనుల సంస్కృతి-సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రపంచ స్థాయి క్షేత్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో ఆదివారం జరిగిన జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క-సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టే బంజారాలకు ప్రత్యేక క్షేత్రం అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం నల్లమల అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించామని వెల్లడించారు. “మానవజాతి శాంతి మార్గంలో నడవాలని బోధించిన సేవాలాల్ మహనీయుడు దేశవ్యాప్తంగా కోట్లాది గిరిజనులకు ఆదర్శం. అలాంటి మహాత్ముని జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత” అని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, బంజారాలు ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించారు. తండాలకు బీటీ రోడ్లు - ప్రతి పంచాయతీకి పాఠశాల భవనం, తెలంగాణలోని అన్ని తండాలు, గూడాలకు తప్పనిసరిగా బీటీ రోడ్డు ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పాఠశాల భవనం, పంచాయతీ భవనం నిర్మాణానికి స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లేని చోట సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసి గిరిజనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. “చదువు లేనందువల్లే చాలా మంది పేదరికంలో మగ్గుతున్నారు. అందుకే నిరుపేదలు చదువుకోవడానికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తాం. కష్టపడి చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలి” అని గిరిజన విద్యార్థులకు సీఎం పిలుపునిచ్చారు.

కరీంనగర్ మేయర్ పీఠంపై పోరు

మొదటిపేజీ తరువాయి

ప్రకారం, కొంతమంది కార్పొరేటర్లకు భారీగా ఆర్థిక ఆఫర్లు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఒక్కో కార్పొరేటర్‌కు కోటి నుంచి మూడు కోట్ల రూపాయల వరకు ఆఫర్లు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. దీంతో కరీంనగర్ రాజకీయాలు ‘నోట్ల యుద్ధం’గా మారాయని ప్రత్యర్థి వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను సంబంధిత పార్టీలు ఖండిస్తున్నాయి.

ఫలితాలు తేలేది నేడే

రెండు పార్టీలూ తమ తమ కార్పొరేటర్లను క్యాంపుల్లో ఉంచి జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఎలాంటి విపక్ష మార్పులు జరగకుండా కఠిన చర్యలు చేపడుతున్నాయి. ఒకో ఓటు విలువ ఇప్పుడు కోట్ల రూపాయలతో సమానం కావడంతో రాజకీయ ఉత్కంఠ మరింత పెరిగింది. మేయర్ ఎన్నికల రోజున అసలు సిసలైన రాజకీయ చిత్రమే బయటపడనుంది. లెక్కలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ చివరి నిమిషం వరకూ ట్విస్టులు ఉండొచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కరీంనగర్ రాజకీయ రణరంగంలో సోమవారం ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో చూడాలి. ఒక ఓటు తేడాతోనే ఫలితం మారే పరిస్థితిలో నగర రాజకీయాలు అత్యంత ఉత్కంఠభరిత దశకు చేరుకున్నాయి. మేయర్ కుర్చీపై ఎవరి జెండా ఎగరబోతుందో అన్న ఉత్కంఠకు సోమవారం తెరపడనుంది!

మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు తగిన ఏర్పాట్లు

నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు తగిన ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం నేపథ్యంలో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆదివారం రోజు సమీక్షా సమావేశం జరిగింది. కమీషనర్ అధికారులకు పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నగరపాలక సంస్థలో ప్రమాణ స్వీకార ప్రక్రియ ఉదయం 11.00 గంటల 12:30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉదయమే నగరపాలక సంస్థ ఆల్ఫా బెటికల్ ఆర్డర్ ప్రకారం అభ్యర్థుల ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం సమావేశ మందిరంలో 12:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు పాలకవర్గ సభ్యులచే మేయర్, డిప్యూటీ మేయర్ ల పరోక్ష ఎన్నిక కొనసాగుతుందని తెలిపారు. ఈ ఎన్నికకు ప్రెసిడింగ్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారని తెలిపారు.

అగ్రి వర్సిటీ పరీక్షల్లో అక్రమాలు

- దర్యాప్తులో కీలక ఆధారాలు లభ్యం
- వర్సిటీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం
- సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి
- ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసే సమయంలో ఫోటో తీసిన ఉద్యోగి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 15: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల్లో అక్రమాలపై పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణతోపాటు సీఐడీ ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. పీజేటీఏయూ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ 2025-26 పరీక్షలకు సంబంధించిన ఈ లీకేజీలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభించింది. ఈ పరీక్షపత్రాల లీకేజీలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు సీఐడీ గుర్తించింది. ఇన్‌సర్వీస్ విద్యార్థులకు పరీక్ష పత్రాలను అతనే లీక్ చేసినట్లుగా గుర్తించారు. ప్రశ్నాపత్రాల్ని జిరాక్స్ తీసే సమయంలోనే అతను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసినట్లుగా బయటపడింది. ఇలా చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పూర్వ ఇన్‌సర్వీస్ విద్యార్థిగా పనిచేసిన శ్రీకాంత్ ఒత్తిడి చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈక్రమంలోనే కార్తిక్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. మూడో ఏడాది మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో ఔట్‌సోర్సింగ్‌సిబ్బంది అజయ్ లీక్ చేసినట్లుగా తేలింది. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల ప్రశ్నాపత్రాలను గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఇన్‌సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ దర్యాప్తు మరింత ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ దర్యాప్తు కొలిక్కివస్తే మరికొందరి పాత్ర బయటపడే అవకాశాలు ఉన్నాయి.

అసాధారణ రీతిలో మార్కులు రావడంతో....

క్లిష్టంగా భావించే ఓ పరీక్షలో ఇన్‌సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు దారితీసింది. దీంతో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబర్ 17న జరిగిన ఆ పరీక్షకు సంబంధించి సీసీ కెమెరాలను పరిశీలించడంతో రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానస్పదంగా కనిపించాయి. ఈనేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ నరేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.పి.రవికుమార్, సంపత్‌లతో కలిపి విచారణ బృందాన్ని నియమించింది. ఈ బృందం జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేష్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్‌సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించినట్టు సమాచారం. శ్రీనివాస్‌ను విచారించగా అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు వాటిని తనకు పంపినట్లు తేలింది. అశ్వారావుపేట కళాశాలకే చెందిన విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించారు.

కేసు దర్యాప్తు ముమ్మరం

అశ్వారావుపేట విద్యార్థినిని విచారించగా వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని వాట్సప్ లో పంపినట్లు తేలింది. ఇందుకోసం అశ్వారావు పేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి తాను రూ.1.4 లక్షలను వసూలు చేసినట్లు అంగీకరించారు. అందులో నుంచి రూ.80వేలను వరంగల్ కళాశాల విద్యార్థిని బదిలీ చేసినట్లు చెప్పారు. వరంగల్ కళాశాల విద్యార్థినిని విచారించడంతో కార్తిక్ నిర్వాకం బట్టబయలయింది. కార్తిక్ సదరు విద్యార్థినికి వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలను పంపినట్లు తేలింది. వరంగల్ విద్యార్థిని ద్వారానే ప్రశ్నాపత్రాలు వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్‌సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు అనుమానిస్తున్నారు. మొత్తంగా సీఐడీ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది.

రాజకీయం

గ్లోబల్ టెక్ బయో పవర్‌హౌస్‌గా తెలంగాణ

- కొత్త ఆవిష్కరణ. సరికొత్త ఆలోచనలకు కీలక వేదిక
- హైటెక్స్ వేదికగా 17, 18న బయో ఏషియా 2026 సదస్సులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి15: గ్లోబల్ టెక్‌బయో రంగంలో తెలంగాణను పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దేందుకు బయో ఏషియా 2026 సదస్సును ప్రజా ప్రభుత్వం హైదరాబాదులో ఫిబ్రవరి 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్నది. హైదరాబాద్లోని హెచ్ఐసీసీ రెండు రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనున్నది. ప్రధానంగా హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్ చేస్తుండగా, సుమారు 50దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సంయుక్తంగా కలిసి ప్రారంభించనున్నారు. "టెక్‌బయో అన్‌లీష్డ్: ఏఐ, ఆటోమేషన్ బయాలజీ రివల్యూషన్" అనే థీమ్ మీద సదస్సు జరగనున్నది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్ లో ప్రజా ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బయోటెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు ఈ బయో ఏషియా సదస్సులో పాల్గొననున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు, ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం ఈ సదస్సులో చర్చిస్తారు. హెల్త్ కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితర అంశాలను ఎజెండా అంశాలుగా ప్రతినిధులు చర్చించనున్నారు. బయో రంగంలో కొత్త ఆవిష్కరణలు, దేశ విదేశాల సహకారాలు, హెల్త్ కేర్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సు ప్రధానంగా తెలంగాణకు ఉపయోగపడనుంది. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స 8విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు చర్చించనున్నారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. ప్రపంచస్థాయిలో హెల్త్ కేర్ హబ్, ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయం విదితమే. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించనుంది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా. హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా. స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు.అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు. భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా. రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు.

జగిత్యాల విభేదాలకు చెక్

- ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగప్రవేశం
- ఇరువర్గాలతో చర్యలు.. ఒక్కటైన నేతలు
- పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యం
- కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్/జగిత్యాల, ఫిబ్రవరి 15: గత కొద్ది రోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పడినట్లు అయింది.

ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డితో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు. ఐక్యత చాటాలని, రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపుపై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్ రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.

పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత

తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో 'విధేయత'కే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తోంది కాంగ్రెస్ అధిష్టానం.

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో ఇటీవల కార్పొరేటర్లుగా గెలిచిన రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఆదివారం సీఎం నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌వారికి దిశానిర్దేశం చేశారు. -ప్రతిపక్షం, హైదరాబాద్

'కేఎల్ఆర్', 'డీబీఆర్' శివరాత్రి ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, రంగారెడ్డి, ఫిబ్రవరి 14: :మహాశివరాత్రి పర్వదినాన్నిపురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, మంకల్ శివాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి (డీబీఆర్) పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ పరమశివుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకేశ్వర్ ముదిరాజ్, కూన యాదయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్,మాజీ జెడ్పిటిసి నేను జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణా నాయక్ వైస్ చైర్మన్ ch యాదయ్య, రాజు నాయక్, పూతర్ల తిరుపతయ్య, రాఘవేందర్ రెడ్డి, రాజ్ కుమార్, పాండు నాయక్, నారాయణ, పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకల్లో మంత్రి దామోదర

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ఫసల్ వాడి గ్రామంలోని శ్రీ జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో భారత దేశంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా 1008 నదులలో తీర్థజలాలను సేకరించి చేపట్టిన జలలింగ అభిషేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో చేపట్టిన గరక పూజలో భాగంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా నదీ జలాలతో కూడిన బిందె ను తలపై పెట్టుకొని ఆమ్లయనం చుట్టూ తిరిగి జలలింగానికి అభిషేకించారు. అనంతరం జలలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది శివ భక్తులు పాల్గొన్నారు. - ప్రతిపక్షం, సంగారెడ్డి

గ్రామాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

- సర్పంచ్ మద్యపాగ కృష్ణ

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 15: గ్రామాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. గ్రామానికి చెందిన నోముల బుచ్చిరెడ్డి తన సొంత నిధులు వెచ్చించి గ్రామంలో స్ట్రీట్ లైట్లతో పాటు బస్టాప్ వద్ద మినీ హై మాస్క్ లైట్ ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్యపాగ కృష్ణ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. మరింత మంది గ్రామాభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని కోరారు. అనంతరం సర్పంచ్ మద్యపాగ కృష్ణ, ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి. వార్డు సభ్యులు, గ్రామస్తులతో కలిసి దాత నోముల బుచ్చిరెడ్డిని కాలువా కప్పి పుష్పగుచ్చం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మన్నె ప్రభాకర్ రెడ్డి, సత్యలింగంగౌడ్, జంగారెడ్డి, యాదయ్య, కృష్ణ, అంజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు చిట్యాల మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ ఎన్నిక

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- పీఠంపై 'పందిరి గీత'

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 15: మున్సిపల్ పాలకవర్గ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ సోమవారం జరగనుంది. ఉదయం 11 గంటలకు నిర్వహించే మొదటి సర్వసభ్య సమావేశంలో కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను తెలిపారు. ఇప్పటికే సభ్యులందరికీ సమాచారం అందించామని, ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ ను ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక అధికారిగా నియమించారు. ఉ. 11 గంటలకు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం మ. 12:30 కి ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను చేపట్టనున్నారు. చేతులు ఎత్తి సభ్యులు వీరికి ఆమోదం తెలపనున్నారు.

చిట్యాల మున్సిపల్ పీఠంపై 'పందిరి'

చిట్యాల మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ గా 15వ వార్డు నుండి గెలుపొందిన పందిరి గీత నేడు ఎన్నిక కాబోతున్నారు. బహిరంగంగా పార్టీ పెద్దలు ఆమె పేరును ప్రకటించకపోయినప్పటికీ ఆమెనే ఛైర్ పర్సన్ అభ్యర్థిగా పోటీలో దిగారనేది బహిరంగ విషయం. అయితే ఇక వైస్ ఛైర్మన్ గా ఎవరనేది అంతర్గతంగా నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సభ్యుడిని వైస్ ఛైర్మన్ గా నియమించనున్నట్లు సమాచారం.

తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలి
- ఆ పరమ శివుడిని అదే వేడుకున్నా
- స్నానాల లక్ష్మీపురంలో డిప్యూటీ సీఎం భట్టి దంపతుల ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 15: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగి, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచంతో పోటీపడి స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి త్రి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దాటి స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆ పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు.మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి. రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆ పరమశివుడిని ప్రార్థించినట్లు భట్టి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచడమే కాకుండా, ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

వైరాలో..

ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి దంపతులకు డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవాలయానికి చేరుకున్న వారికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానించారు. మహాశివరాత్రి పుణ్యకాలం సందర్భంగా భట్టి విక్రమార్క దంపతులు రామలింగేశ్వర స్వామి వారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. లోకకల్యాణం కోసమే ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధి పురోగతి పనుల పరిశీలన

స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ ఆవరణలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్నానాల ఘాట్, కళ్యాణ మండపం, రథశాల పనులతో పాటు వైరా నదిపై నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ఆయన నిశితంగా పరిశీలించారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడగా, చిరునవ్వుతో వారితో కలిసి ఫొటోలు దిగి సందడి చేశారు.

సీఎం, మంత్రుల పేరిట పూజలు....

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన సతీమణి నందినితో కలిసి మధిరలోని గంగా పార్వతీ సమేత మృత్యుంజయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఘట్టంగా, స్వామివారి గర్భాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, అలాగే రాష్ట్ర మంత్రి వర్గంలోని కేబినెట్ మంత్రుల పేరిట వారి గోత్రనామాలతో భట్టి విక్రమార్క దంపతులు ప్రత్యేక అర్చన చేయించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావాలని, పాలకవర్గంపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని వారు ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు.

గులాబీ గూటికి జిన్నారం స్వతంత్ర అభ్యర్థి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 15 : కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన స్వతంత్ర అభ్యర్థులు సైతం గులాబీ గూటికి చేరుతున్నారు. తాజాగా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన శిల్పా నాగరాజు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో పటాన్ చేరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్వతంత్ర అభ్యర్థులు సైతం బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని తెలిపారు. ఇందుకు సంపూర్ణ సహకారం అందించిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పూర్తి విశ్వాసంతో ఆశీర్వదించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రాజ్ కుమార్, కృష్ణ, గోవింద్, మచ్చేందర్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌పై సాధించిన విజయం ఇండియాకు అంకితం.. మేం ఎలా ఆడాలనుకున్నామో అదే బ్రాండ్ క్రికెట్ ఆడాం. ఈ పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేయడమే మంచి ఆప్షన్. అభిషేక్ ఔటైన తర్వాత ఇషాన్ కిషన్ బాధ్యత తీసుకుని ఆడిన విధానం అద్భుతం. 155 కొట్టినా సరిపోతుందని అనుకున్నాం. బంతితో ప్రతి ఒక్కరూ రాణించారు.

- కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

బహుళ

యాది

తెలుగు పత్రికా రంగానికి మార్గ నిర్దేశకుడు నార్ల

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నార్ల వెంకటేశ్వరరావు... పరిచయం అక్కర్లేని పేరు. నిర్భయానికి, నిక్క చ్చితత్వానికి, నిబద్ధతకు మారు పేరు. వృత్తి నిబద్ధతతో నిర్వహిం చారు. వృత్తి నిర్వహణ సామాజిక బాధ్యతగా భావించారు. పత్రికా రంగానికి మార్గదర్శకులు, జర్నలిస్టు లకు దిశానిర్దేశకులు. ఆయనొక విజ్ఞాన సర్వస్వం. అయన జీవితం సంస్కరణల మయం. రచన ఏది చేసినా, ప్రక్రియ ఎదైనా, ప్రజా చైతన్యమే ఆయన లక్ష్యం. లక్ష్య సిద్ధి కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకే సాగిన వైనం. రచయితగా, నాటకకర్తగా, విమర్శ కుడిగా, అనువాదకుడిగా బహు ముఖ పాత్రలు పోషించిన ఆయన జీవిత పర్యంతం హేతుబద్ధమైన ఆలోచనల ద్వారా సామాజిక స్పృహ కల్పించే ప్రయత్నం చేశారు. ఆంగ్ల భాషలోనూ నిష్ణాతులైనా, తెలుగు ప్రజలకు తన రచనలు చేరువ కావాలనే తలంపుతో, తెలుగు పత్రికా రంగాన్ని కావాలనే ఎంచుకున్నారు.

మధ్య ప్రదేశ్ లోని జబల్‌పూర్‌లో డిసెంబర్ 1, 1908 జన్మించిన నార్ల, విద్యాభ్యాసం కృష్ణా జిల్లాలో జరిగింది. వెంకటేశ్వరరావు ఏప్రిల్ 3, 1958 నుండి ఏప్రిల్ 2, 1970 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. స్వరాజ్య, జన వాణి, ప్రజా మిత్ర పత్రికలో పని చేసి, ఆంధ్ర ప్రభ, చివరకు ఆంధ్ర జ్యోతి పత్రికలకు ఎడిటర్ గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ఎన్నడూ అయన రాజీ పడలేదు. ఆయన సంపాద కీయ రచనలు సూటిదనం, గడుసు దనం, వ్యంగ్యం, చమత్కారం, లోక జ్ఞత, సమయజ్ఞత కల గలిపి ఉండే వి. పండితునికి, పామరునికి తెలు గు భాష అర్థమయ్యే రీతిలో నార్ల సంపాదకీయాలు, రచనలు చేశారు. ''వాస్తవమ్ము నా

ర్లవారి మాట'' మకుటంతో ఆటవెలదులు రచించారు. ''నవయుగాల బాట నార్ల మాట'' మకుటంతో 700కు పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. 16 ఏకాంకికల సంపుటి వెలువరించారు. నార్ల సొంత గ్రంథాలయంలో 20,000 పుస్తకాలు ఉండేవట అంటే మాటలు కాదు. సంపాదకుడు అనే మాటను అయన అంగీకరించ లేదు. ఆమోదించ లేదు. ఎడిటర్ అనే పదాన్నే వాడే వారు. నార్ల... టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, , కాసు బ్రహ్మానంద రెడ్డి, ఎన్.జి. రంగా ఎవరినీ వదల లేదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ చాందసాన్ని విమర్శించక మాన లేదు. ఇందిరా గాంధీ, ఆమె కుటుంబ వారసత్వ రాజకీయాల్ని ద్వేషించారు. ఆయన వ్యాసాలను నిరక్షరాస్యులు గ్రామాల్లోని రచ్చబండల దగ్గర చదివి వినిపించుకునే వారంటే ఆయనలోని రచనా వ్యాసంగ శక్తి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రభ నుంచి వైదొలిగిన సందర్భంలో, నార్ల కోసం కొందరు ముఖ్యులు కలిసి ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రారంభించారంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. గోరాశాస్త్రి మాటల్లో చెప్పాలంటే 'కేవలం సత్వగుణ ప్రధానంగా, అచ్చ తెలుగులో చప్పచప్పగా ఉన్న పత్రికా రచనలో వాడినీ, వేడినీ సృష్టించి, తెలుగు నుడికారంలో ఎంత 'కారం' ఉందో తెలియజెప్పిన వాడు' నార్ల. "యొక్కలతో తెలుగుభాష డొక్క పొడవొద్దు...ఎంత గొప్ప వాడైనా వస్తాడే కాని విచ్చేయడు... సంపాదకుడు అనొద్దు ఎడిటర్ అనండి...బడు వాడేవాడు బడుద్ధాయి. అంటూ పత్రికా భాష ఎలా ఉండాలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఫిబ్రవరి 16, 1985న ఈ లోకాన్ని వీడి వెళ్లిన నార్ల తెలుగు సాహిత్య, పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేసి వెళ్లారు. "ఎడిటరైన వాడు బిడియము చూపుచో ధాటి తగ్గు వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా'' "నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్పువాని కంటే తక్కువ వాడురా" అంటూ విలువలు వీడ వలదని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయన చేసిన మార్గ నిర్దేశం నేటి జర్నలిస్టులకు నిజంగానే శిరోధార్యం.

(ఫిబ్రవరి 16.... నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి)

వ్యాసరచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్

22న 'కవి సాయంత్రం' ఆత్మీయ సమ్మేళనం

గత పదేళ్లుగా పరిపుష్టమైన రచనలతో సాహిత్య కార్యశాలగా వెలుగొందుతున్న "కవి సాయంత్రం" (సోషల్ మీడియా గ్రూపు) 8వ ఆత్మీయ సమ్మేళనం నాచారంలోని ప్రతిభ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారి జి.వి. శ్యాం ప్రసాద్ లాల్, ప్రముఖ సినీగేయ రచయితలు మిట్టపల్లి సురేందర్, మౌనశ్రీ మల్లిక్, సినీ విశేషకులు పొన్నం రవిచంద్ర, ఉద్యమ గాయని అరుణోదయ నిర్మల తదితరులు హాజరవుతారు.

- ముక్కెర సంపత్ కుమార్

వ్యవస్థాపకులు , 9959618206

పరిచయం

నేపాలీ సాహిత్యంలో స్త్రీ వాద కవి, విచిత్ర వ్యక్తుల కథాశిల్పి ఉషా షేర్చన్

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

'నా తల్లివి కదా అని గోముగానో, వంట బాగా చేశావనో మెచ్చుకున్నా పొంగిపోవడం సహజమే ఆడ మనసు'.అంత మాత్రాన ఏ సమస్యలు ,బాధలు లేని సమాజంలో వివక్షలేని సమానత పట్టీపై జీవిస్తున్నట్లు కాదు.'ఆకాశంలో సగం' సమాజంలో హక్కులకోసం, న్యాయంకోసం,సామాజిక వివక్షత,లైంగిక వేధింపులపై పోరాడడం,గళమెత్తడం సమానత్వం కోసం కొత్తశక్తిని కూడగట్టుకోవడం కనిపించే సామాజిక జీవన చిత్రం.ఈ నేపథ్యంలో కవులు రచయితల కలాలు స్త్రీవాదాన్ని భుజానికి ఎత్తుకోవడం సామాజిక బాధ్యత పట్ల వారి పాత్రను తెలుపడమే. ఆ కోవలోనే నేపాలీ కవి,రచయిత్రి ఉషా షెర్చన్ రచనలు గుర్తుకురావడం ఆమెలోని సామాజిక సృజనాత్మక కళాత్మక సృజనకు అద్దం పడుతుంది.ఉషా షెర్చన్ ఆగస్టు 22, 1955న పోఖరా నగరంలోని నలముఖ్‌లో జన్మించిన నేపాల్ కవయిత్రి, గేయ రచయిత్రి . ఆమె తండ్రి రూపత్ బహదూర్ భట్టాచన్ , తల్లి యమ్ కుమారి భట్టాచన్‌లు.ఆమె మూడు కవితా సంకలనాలు, ఒక చిన్న కథల సంకలనం, ఒక నవలను ప్రచురించింది. ఆమె ఐదు సంగీత ఆల్బమ్‌లకు కూడా సాహిత్యం అందించింది. ఆమె తన కవితలు , కథలలో వివిధ సామాజిక , స్త్రీవాద సమస్యల గురించి రాస్తుంది. నేపాల్‌లో విచిత్ర వ్యక్తుల గురించి కథలు రాసే అతికొద్ది మంది రచయితలలో ఒకరుగా ఆమె ప్రతీతి.ఆమె ఎస్. ఎల్.సి. విద్యను పూర్తి చేశాక, ఆమె తల్లిదండ్రులు ఆమెను వివాహం చేసుకోమని బలవంత పెట్టడం, అయినా ఆమె తదుపరి విద్యను ఖాట్మండుకు వెళ్లి అక్కడ రత్న రాజ్య లక్ష్మి క్యాంపస్‌లో చదువుకుంది. ఆ తర్వాత ఆమె బ్యాచిలర్ చదువు కోసం పోఖారాలోని పృథ్వీ నారాయణ్ క్యాంపస్‌లో చేరింది. ఆమె తండ్రి పోఖారాలోని హిమా గృహ ప్యాలెస్‌కు ఇన్‌చార్జ్‌గా రాజకుటుంబంలో పనిచేశారు. దాంతో రాజకుటుంబంనుండి షెర్చన్ తదుపరి విద్యకు సహాయం అందింది. సాహిత్య ప్రస్థానంలో ఆమె పృథ్వీ నారాయణ్ క్యాంపస్‌లో, ఆమె సారు భక్త , తీర్థ శ్రేష్ఠ, ప్రకత్ ప్రగేని శివ, బినోద్ గౌచన్ వంటి వివిధ రచయితలను కలిసింది. ఆమె ఆర్ఆర్ క్యాంపస్‌లో చదువుతున్నప్పటి నుండి తన నోట్ బుక్‌లో కవితలు రాసినా ప్రచురించలేదు. ఆమె స్నేహితుడు బినోద్ గౌచన్ ఆమె కవితలలో ఒకటైన 'జిందగీని' చూసి జాతీయ దినపత్రిక గూర్ఖాపాత్రకు పంపడంతో ఆ కవిత 1978లో గూర్ఖాపాత్రలో ప్రచురించబడింది. ఆమె 1991లో నాజన్మేక అస్తహరు అనే తన మొదటి కవితా సంకలనాన్ని ప్రచురించింది. ఆమె రెండవ పుస్తకం, అక్షరహరుక శివిర్బత ద్విపదల (ముక్తక్) సంకలనం , 1999లో ప్రచురించబడింది. సర్వకలీన్ పిండా రా జాగృతికా శంఖఘోష్ , ఆమె మూడవ కవితా సంకలనం 2006లో ప్రచురించబడింది.

ఆమె తోటి రచయితలతో కలిసి దుర్గా బరల్ దర్శకత్వం వహించిన పోఖరాలో పోఖేలి యువ సంస్కృతి పరివార్ అనే రచయితల క్లబ్‌ను ప్రారంభించింది.

ఆమె 1991లో నాజన్మేక అస్తహరు అనే తన మొదటి కవితా సంకలనాన్ని ప్రచురించింది. ఆమె రెండవ పుస్తకం, అక్షరహరుక శివిర్బత ద్విపదల (ముక్తక్) సంకలనం , 1999లో ప్రచురించబడింది. సర్వకలీన్ పిండా రా జాగృతికా శంఖఘోష్, ఆమె మూడవ కవితా సంకలనం 2006లో ప్రచురించబడింది.

2009లో, ఆమె ఒక సన్నిహిత స్వలింగ సంపర్కుడిని వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడం గురించి ఒక చిన్న కథను ప్రచురించింది. 2013లో, ఆమె తన మొదటి

చిన్న కథా సంకలనం టెస్రో రంగ్‌ను ప్రచురించింది.ఈ కథల్లో ఎల్‌జిబిటిక్యూ+ కమ్యూనిటీ నుండి బహుళ పాత్రలు ఉన్నాయి. ఆమె తన మొదటి నవల ఆదిని 2019 లో ప్రచురించింది. ఈ నవల రచన లైంగిక వేధింపులకు గురైన స్త్రీ గురించిన థీమ్ తో ఉన్నది.

సాహిత్య సంస్కృత సేవలో భాగంగా ఆమె తోటి రచయితలతో కలిసి దుర్గా బరల్ దర్శకత్వం వహించిన పోఖరాలో 'పోఖేలి యువ సంస్కృతి పరివార్' అనే రచయితల క్లబ్‌ను ప్రారంభించింది. సాహిత్యం , సంగీతానికి ఆమె చేసిన కృషికి పారిజత్ రాష్ట్రీయ ప్రతిభా పురస్కార్ , రత్న శ్రీ సువర్ణ పదక్ వంటి 13 అవార్డులను అందుకున్నారు. ఉషా షెర్చన్ ఒక ప్రఖ్యాత నేపాలీ కవయిత్రిగా తన పదునైన, స్త్రీవాద మరి సామాజిక స్పృహతో కూడిన కవిత్వానికి ప్రసిద్ధి చెందింది. ఆమె నేపాలీ సమాజంలో సాంప్రదాయ లింగ పాత్రలను తరచుగా సవాలు చేస్తుంది, మహిళల అనుభవాలు, గుర్తింపు ఇంకా ప్రతిఘటన యొక్క ఇతివృత్తాలపై దృష్టి పెడుతుంది. 'హమ్మింగ్ ఎ ట్యూన్ అఫ్ హియర్ ఓన్'తో సహా ఆమె రచనలు సంప్రదాయవాద సమాజంలోని వ్యక్తిగత కథనాలను కూడా అన్వేషిస్తాయి. ఇక ఇతివృత్తాలుగా ఆమె కవితలు తరచు వలసరాజ్యానంతర అంశాలు, స్త్రీవాదం, నోస్టాల్జియా మరింకా సమాజంలో స్త్రీగా ఉండటంలోని సంక్లిష్టతలపై కేంద్రీకృతమై ఉంటాయి. ఆమె శైలి ఆమె కవిత్వం వ్యక్తిగత గొంతు మరియు సామాజిక వ్యాఖ్యానాల సమ్మిశ్రమంగా కనిపిస్తాయి. మహిళలలోని చెప్పలేని అనుభవాలకు స్వరం ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది.

కవిత

నా దారి అక్షరసుపథం

దారిని కనిపెట్టాలని ఉన్నది
గమ్యం అనే కలను
అడుగుల ముందే నిలిపి
త్వరగా చేరవేయాలని ఉన్నది.

దారిని చూపాలని ఉన్నది
చీకటి మలుపుల్లో
ధైర్యం అనే దీపాన్ని
మనసుల చేతుల్లో వెలిగించాలని ఉన్నది.

దారిని మలచాలని ఉన్నది
తప్పుదోవల వంకరలను
సరైన దిశగా తిప్పి
నిశ్శబ్దంగా సరి చేయాలని ఉన్నది.

దారిని చెయ్యాలని ఉన్నది
అలసిన అడుగులకు ఆశ్రయమై
ప్రయాణమే గురువయ్యేలా
జీవనానికి నిలకడ నేర్పాలని ఉన్నది.

దారిని పట్టించాలని ఉన్నది
వంచనల వలల్ని విడదీసి
నిజానికి సూటి మార్గాన్ని
అడుగుల కింద పరచాలని ఉన్నది.

దారిని కాచాలని ఉన్నది
నిద్రపోని కళ్లతో
దోపిడీ చేసే ఆలోచనల్ని
మొగ్గలోనే తుంచేయాలని ఉన్నది.

దారికి తేవాలని ఉన్నది
జీవితపు చెల్లాచెదురు క్షణాల్ని
ఒక అర్థవంతమైన పథంగా
సరిదిద్దాలని ఉన్నది.

దారిని వెంబడించాలని ఉన్నది
ముష్కరుల ఆటల్ని
సత్యపు వెలుగులో నిలబెట్టి
నిర్వీర్యం చేయాలని ఉన్నది.

అక్షరాల దారిన నడవాలని ఉన్నది
మదిలో మరిగే భావాల్ని
మౌనాన్ని చీల్చి
పదాలుగా మలచాలని ఉన్నది.

కవితా దారిని పట్టాలని ఉన్నది
కమ్మని అనుభూతుల్ని
లయలో కూర్చి
మనసులకు చేరవేయాలని ఉన్నది.

నా దారి
కేవలం రహదారి కాదు
అది జీవితాన్ని సరిదిద్దే
అక్షరాల శాశ్వత మార్గం.

నా దారి
లక్ష్యాలను చేర్పించే సుపథం,
విజయాలను చేకూర్చే సన్మార్గం,
జీవితాలను గెలిపించే అక్షరాల సత్సంచారం.

గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



సమీక్ష

పుట్టిన గడ్డపై తీరని మమకారం

ముహమ్మద్ ముజాహిద్
0000

మేధావులు తమ మూలాలను మర్చిపోయి విదేశాలకు తరలిపోతున్న ఈ కాలంలో, 'డాక్టర్ ముహమ్మద్ ఖుతుబుద్దీన్: ఆలోచనలో విప్లవం, ఆచరణలో మానవతా దీపం' పుస్తకం మనిషికి తన పుట్టిన గడ్డతో ఉండే బంధం ఎంత గొప్పదో గుర్తుచేస్తుంది. వ్యాసాలు మరియు ఇంటర్వ్యూల సంకలనంగా రూపొందిన ఈ గ్రంథం, నారాయణపేటలోని ఉర్దూ మాధ్యమ పాఠశాల నుండి అమెరికాలో అగ్రశ్రేణి మనోవైజ్ఞానిక నిపుణుడి స్థాయికి ఎదిగిన డాక్టర్ ఖుతుబుద్దీన్ అసాధారణ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తుంది.

రెండు ప్రపంచాల వారధి

ఈ జీవిత చరిత్ర కేవలం కాలక్రమ సంఘటనల నమోదు కాదు; ఇది డాక్టర్ ఖుతుబుద్దీన్ బహుముఖ వ్యక్తిత్వానికి నిదర్శనం. నాలుగు దశాబ్దాలుగా అమెరికాలో నివసిస్తున్నప్పటికీ, ఆయన శరీరం అక్కడ ఉన్నా హృదయం మాత్రం తెలంగాణ మట్టిలోనే ఉందనే విషయాన్ని ఈ పుస్తకంలోని పలువురు రచయితలు నొక్కి చెప్పారు. ముఖ్యంగా నారాయణపేటను జిల్లాగా మార్చే ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, స్థానిక అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయం.

వైద్యుడు మరియు లెజెండ్

ప్రపంచ బాక్సింగ్ దిగ్గజం ముహమ్మద్ అలీతో డాక్టర్ ఖుతుబుద్దీన్‌కు ఉన్న 27 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఈ పుస్తకంలో అత్యంత ఆసక్తికరమైన అంశం. అలీకి వ్యక్తిగత సలహాదారుగా ఉంటూ, ఆ క్రీడాకారుడి ఆధ్యాత్మిక కోణాన్ని ఆయన విశ్లేషించారు. అలీ రింగ్‌లో గెలవడానికి ముందే తన మనసులో ఎలా విజయం సాధించే వారో ఆయన వివరించారు. కేవలం ప్రశంసలతోనే కాకుండా, ఒక మనోవైద్యుడిగా సమాజాన్ని పీడిస్తున్న సమస్యలపై కూడా ఆయన గళమెత్తారు. యువతలో పెరుగుతున్న 'అశ్లీల వీడియోల వ్యసనం' మరియు 'మాదకద్రవ్యాల వినియోగం'పై ఆయన రాసిన వ్యాసాలు ఒక వైద్యుడి శాస్త్రీయ దృక్పథాన్ని, ఒక మానవతావాది సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆధునిక వైద్య శాస్త్రాన్ని, ఆధ్యాత్మిక విలువలతో (తిబ్బెనబవి) జోడించి చికిత్స చేయాలని ఆయన వాదించారు.

పుస్తకం పేరు: డాక్టర్ ముహమ్మద్ ఖుతుబుద్దీన్: ఆలోచనలో విప్లవం, ఆచరణలో మానవతా దీపం

రచయితలు: డాక్టర్ తబ్రేజ్ హుసైన్ తాజ్ & ముఫ్తీ సయ్యద్ ఆసిఫుద్దీన్ నద్వీ ఖాస్మి

అనువాదం: ముహమ్మద్ ముజాహిద్

ప్రచురణ: మీడియా ప్లస్ ఫౌండేషన్, హైదరాబాద్

ధర: ₹350



బహుభాషా కోవిదుడు

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో భాషా ప్రాముఖ్యతను కూడా ఈ పుస్తకం నొక్కి చెబుతుంది. ఉర్దూ, అరబిక్, పర్షియన్, స్పానిష్ మరియు జపనీస్ వంటి తొమ్మిది భాషల్లో నైపుణ్యం సంపాదించినప్పటికీ, తన మాతృభాష ఉర్దూపై ఆయనకున్న మమకారం ప్రవాస భారతీయులకు ఒక ఆదర్శం.

ముగింపు

ఈ పుస్తకం ఒక వ్యక్తికి దక్కిన నివాళి మాత్రమే కాదు, 'ఆచరణాత్మక మానవతావాదం' గురించి చెప్పే పాఠం. అమెరికన్ డ్రీమ్‌ను సాకారం చేసుకుంటూనే, తన స్వదేశీ వాస్తవికతను మరువని ఒక గొప్ప వ్యక్తి కథ ఇది. సైకాలజీ, ఆధ్యాత్మికత మరియు సామాజిక సేవపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

సమీక్షకులు

ఆధ్యాత్మిక రచయిత

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

సంగారెడ్డి లో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 15: మహా శివరాత్రి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో భక్తి పారవశ్యం నెలకొంది. టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో గంజ్ మైదాన్‌లో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని గంజ్ మైదాన్‌లో ప్రముఖ సినీ నేపథ్య గాయకుల సమక్షంలో భక్తి సంగీత విభావరి ఏర్పాటు చేయబడింది. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 3 గంటల వరకు సాగిన ఈ సంగీత కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ వీణా విద్వాంసురాలు వీణా వాణి తన వీణా వాదనతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నేపథ్య గాయకులు వందేమాతరం శ్రీనివాస్, మనో, శ్రీ కృష్ణ పాల్గొని భక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. అలాగే గాయనీమణులు కల్పన, సురేఖ దివాకర్, మాళవిక తమ గానంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేలాదిగా పట్టణ ప్రజలు, శివభక్తులు ఈ కార్యక్రమానికి హాజరై భక్తి గీతాలను ఆస్వాదించారు. శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ మహా సంగీత విభావరి సంగారెడ్డిలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.

వేయి స్తంభాల గుడికి భక్తుల వరద

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 15: మహా శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని ప్రఖ్యాత వేయి స్తంభాల దేవాలయానికి భక్తులు వరదలా వచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భారీగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాలతో అలంకరించబడగా, శివనామస్మరణతో ఆ ప్రదేశం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయ అర్చకులు లింగాభిషేకం, రుద్రాభిషేకం, మహామంగళ హారతులు నిర్వహించారు. రాత్రి జాగరణ కార్యక్రమంలో భాగంగా భజనలు, శివతాండవ స్తోత్ర పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఇక హనుమకొండలోని ఇతర శివాలయాలు, ముఖ్యంగా భద్రకాళి దేవాలయం పరిసర ప్రాంతాల దేవాలయాల్లో కూడా మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టగా, మున్సిపల్ అధికారులు శుభ్రత చర్యలు చేపట్టారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని శివుని కటాక్షం కోరుకున్నారు. "ఓం నమఃశివాయ" నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా శివభక్తుల ఉత్సాహం హనుమకొండ నగరమంతటా స్పష్టంగా కనిపించింది.

శివ నామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

- గోదావరి నదికి పోటెత్తిన భక్తజనం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 15: మహాశివరాత్రి సందర్భంగా మంచిర్యాలలో శివనామ స్మరణతో ఆలయాలన్నీ మార్మోగిపోయాయి. గోదావరి నదిలో ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించి భక్తజనం మొక్కలు చెల్లించుకున్నారు. జిల్లాలోని మంచిర్యాల పుష్కర ఘాట్ ఎల్లంపల్లి డ్యాం సీసీసీలోని ఫిల్టర్ బెడ్ సింగారం ప్రాంతంలోని గోదావరి బ్రిడ్జి తదితర ప్రాంతాలలో బెల్లంపల్లి, శ్రీరాంపూర్, సిసిసి, తాండూర్, లక్షెట్టిపేట వివిధ గ్రామాల ప్రజలు గోదావరి నది తీరాన ఉదయం నాలుగు గంటల నుండి స్నానాలకు బయలుదేరి పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా మంచిర్యాలలోని గౌతమేశ్వర ఆలయం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయం, శివాలయం, గుడిపేటలోని శివాలయం, గూడెం గుట్ట వద్ద సత్యనారాయణ దేవస్థానం ప్రాంతాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వారి మొక్కులను చెల్లించుకున్నారు. విశ్వనాథ ఆలయంలోని శివాలయంలో ఉదయం 3:30 గంటల నుండి ప్రత్యేకమైన పూజలు చేశారు. అర్చకులు రుద్రాభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించిన భక్తులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

నేడు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

- ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక సమావేశానికి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎం.పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలలో కూడా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా స్పెషల్ మీటింగ్ కు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు జరుగకుండా ఆయా మున్సిపాలిటీల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అన్నారు. కాగా, ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం అవుతుందని, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో స్పెషల్ ఆఫీసర్లు ప్రమాణ స్వీకారం చేయిస్తారని అన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు మేయర్/డిప్యూటీ మేయర్, ఛైర్మన్/వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగుతుందని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమీషనర్

నిజామాబాద్ కార్పొరేషన్ లో సోమవారం జరుగనున్న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నిర్వహణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగేలా చూడాలని, కార్పొరేటర్స్ ఇతర అధికారుల ఏర్పాట్లు చేసిన భద్రతను అన్నీ చోట్ల పటిష్ట బందోబస్తూ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారిచేసారు. ఈ సందర్భంగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎస్. దిలీప్ కుమార్, టౌన్ 4 ఎస్.హెచ్.ఓ ఎస్. సతీష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

ఏఐఎఫ్‌బి కార్పొరేటర్లకు విప్ జారీ

- పార్టీని ధిక్కరిస్తే చర్యలు
- ఏఐఎఫ్‌బి కార్పొరేటర్ ను బీజేపీలో చేర్పించుకోవడం సిగ్గుచేటు
- ఏఐఎఫ్ బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి15: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ విపుల సాయి జ్యోతి, 27వ కార్పొరేటర్ బోట్ల శ్యామల లకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ విప్ జారీ చేయడం జరిగిందని..ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోజి రెడ్డి మాట్లాడుతూ ఏఐఎఫ్బి పార్టీ బి ఫాం పైన గెలిచిన ఇద్దరు కార్పొరేటర్ లో ఒకరిని 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతిని కేంద్ర మంత్రి బండి బిజెపిలో చేర్చుకోవడం సిగ్గుచేటు అని అన్నారు..ఒక కమ్యూనిస్టు పార్టీలో గెలిచిన అభ్యర్థులను బిజెపి పార్టీలో చేర్చుకోవడానికి బండి సంజయ్ కి సిగ్గుండాలి అని, మేయర్ స్థానం కోసం బిజెపి వాళ్లు నీచమైన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. బిజెపికి మేయర్ ఎన్నుకోవడానికి పూర్తిస్థాయిలో కార్పొరేటర్లు లేరని కావున ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ మరియు ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని కిడ్నాప్ చేసి పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందని.ఇప్పటివరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేషన్ లో ఎవరికి మద్దతు ఇవ్వాలో అధికారికంగా ప్రకటించలేదని మా పార్టీ బీఫామ్ పైన గెలిచి ఇతర పార్టీలకు వెళితే నాయపనమైన ఏమైనా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్లకు విప్ జారీ చేయడం జరిగిందని సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆలిండియా ఫార్వర్డ్ బ్యాక్ పార్టీ కేంద్ర రాష్ట్ర కమిటీలు ఎవరికి మద్దతు ఇవ్వాలో స్పష్టత వస్తుందని బిజెపికి మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని మత రాజకీయాలను రెచ్చగొట్టే విధంగా బిజెపి వాళ్లు చేస్తున్నారని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బీఫామ్ పైన గెలిచిన కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బిజెపి పార్టీ గుర్తిస్తుందని ఏ పార్టీలో గెలిచారో కూడా తెలుసుకోకుండా ఇతర పార్టీలో గెలిచిన వారికి బిజెపి కండువలు వేస్తున్నారని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కమిటీ కరీంనగర్లో కార్పొరేషన్ లో గెలిచిన 15 డివిజన్ కార్పొరేటర్ సాయి జ్యోతి 27 డివిజన్ కార్పొరేటర్ శ్యామలకు విప్ జారీ చేయడం జరిగిందని పార్టీని ధిక్కరిస్తే పార్టీ పరంగా చర్యలు తప్పవని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ నగర అధ్యక్షుడు సత్య రావు తదితరులు పాల్గొన్నారు..

కరీంనగర్‌లో బీజేపీకి మెజారిటీ లేదు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్/వేములవాడ, ఫిబ్రవరి 15: నిజామాబాద్ మాదిరిగానే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచిన కార్పొరేటర్లు కలిసి మేయర్‌ను ఎన్నుకోవాలని ఆయన సూచించారు.నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 60 సీట్లు ఉండగా, బీజేపీకి 28 సీట్లు మాత్రమే వచ్చినట్లు మంత్రి తెలిపారు. కరీంనగర్‌లో మొత్తం 69 మంది సభ్యుల్లో బీజేపీకి 30 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితిలో మెజారిటీ లేకుండానే మేయర్ పదవిని ప్రకటించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీగా బీజేపీ ముందుగానే మేయర్ పదవిపై హక్కు ప్రకటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇండిపెండెంట్లను కలుపుకోవడం అనైతికం కాదా అని ప్రశ్నించారు. అన్ని రాజకీయ పార్టీలకు తమ తమ వ్యూహాలు ఉంటాయని, గెలిచిన ప్రజా ప్రతినిధులు వారి ఆలోచనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు.ముఖ్యమంత్రి, మంత్రుల జోక్యం లేదని స్పష్టం చేసిన ఆయన, జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. కరీంనగర్ వంటి మూడు లక్షల ఓటర్లున్న ముఖ్య పట్టణానికి మంచి పాలకవర్గం అవసరమని పేర్కొన్నారు.బీజేపీ తరఫున గెలిచిన 30 మంది సభ్యులకు, మిగతా 36 మంది సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, 16వ తేదీన జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలని అన్నారు. ప్రజాస్వామ్య విధానంలో మేయర్ ఎన్నిక జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక

- మూడు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్సే!
- కామారెడ్డి లో వీడని సస్పెన్స్?

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 15 : జిల్లాలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం, నూతన చైర్మన్ లు, వైస్ చైర్మన్ ల ఎన్నికల నిర్వహణ కోసం సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా లోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలలో ఈ నెల 16 న నిర్వహించనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శాంతియుత వాతావరణంలో ఎన్నిక జరిగేలా చూడాలని, కౌన్సిలర్లు,ఇతర అధికారుల ఏర్పాట్లు చేసిన భద్రతను అన్నీ చోట్ల పటిష్ట బందోబస్తూ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారిచేసారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత మొదటిసారి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి.

మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతం

మున్సిపల్ ఎన్నికల్లో జిల్లా లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అధిక కౌన్సిలర్ స్థానాలను సాధించి, మున్సిపల్ చైర్మన్ పీఠలను దక్కించుకుంది. కామారెడ్డి లో మాత్రం హంగ్ ఏర్పడింది. బాన్సువాడ లో 19 వరులకు గాను కాంగ్రెస్ 11, బిజెపి 3, బీఆరెస్ 3, ఎం ఐ ఎం 1, స్వతంత్ర 1 దక్కించుకున్నారు. ఎల్లారెడ్డిలో 12 వార్డులకు గాను కాంగ్రెస్ 10, బీఆరెస్ 1, స్వతంత్ర 1 సాధించారు. బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో మొత్తం 12 వార్డులకు గానూ 10 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఆయా మున్సిపాలిటీలలో కౌన్సిలర్ లు క్యాంపులకు వెళ్లారు. కామారెడ్డి మున్సిపాలిటీ లో హంగ్ ఏర్పడింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ పోరు హంగ్ ఏర్పాటుకు దారి తీసింది. పట్టణంలో బిజెపికి గట్టిపట్టుంది. గతంలో 8 సభ్యులు బిజెపి కౌన్సిలర్ గెలవగా, ప్రస్తుతం16కు చేరింది. 20 సభ్యులు కౌన్సిలర్ గా గెలుస్తామనుకున్న బిజెపి 16 తో సరిపెట్టుకుంది, కాంగ్రెస్ పార్టీ బోల్తా పడింది. అధికార కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి మున్సిపాలిటీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు భావించినప్పటికీ 19 స్థానలతో సరిపెట్టుకోంది. ఇటు బిజెపికి, అటు బిఆర్ఎస్ పార్టీకి లాభం చేకూర్చేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేశారు. బి ఆర్ఎస్ పార్టీకి 11 స్థానాలు దక్కాయి, 3 స్థానాలు స్వతంత్ర సభ్యులు గెలుపొందారు. కింగ్ మేకర్ గా భారత రాష్ట్ర సమితి ఏర్పడింది. బి ఆర్ ఎస్ పార్టీ సపోర్ట్ లేకుండా కామారెడ్డి మున్సిపల్ ను కైవసం చేసుకోవడం ఈరుపాటిలకు వీలు కాదు. ఐతే కాంగ్రెస్ లో ఇప్పటికే ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు చేరడంతో బలం 22కు చేరింది. బీఆరెస్ కౌన్సిలర్ లు కూడా కాంగ్రెస్ లో చేరారనే ప్రచారం జరిగినా, ఇది వాస్తవం కాదని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఎన్నికపై సస్పెన్స్ నెలకొంది.

కరీంనగర్ మేయర్‌గా కొమురయ్యే పేరు!

- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎఐఎం, ఇండిపెండెంట్లు ఏకం

ప్రతిపక్షం, కరీంనగర్, ఫిబ్రవరి 15: కరీంనగర్ రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మ్యాజిక్ ఫిగర్ కోసం ప్రయత్నాలు చేసి చివరకు సఫలం అయిన కూటమి సంచలన నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. విమర్శలు తిప్పి కొట్టే విధంగా కార్పొరేషన్ లో కీలకంగా ఉన్న రెండు పార్టీల ముఖ్య నాయకులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వారు కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన వివేకానంద విద్యా సంస్థల వ్యవస్థపకుడు కొమురయ్య పేరును ఫైనల్ చేసినట్టుగా విశ్వసనీయంగా తెలుస్తోంది. విద్యావంతుడైన కొమురయ్య పేరును ప్రతిపాదించినందుకే తాము కూడా మద్దతు ఇచ్చామని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం వరకూ మెజార్టీ కోసం పావులు కదిపి చివరకు సక్సెస్ కావడంతో కొమురయ్య పేరును మేయర్ ప్రతిపాదించాలని నిర్ణయించుకున్నట్టుగా సమాచారం. మధ్యాహ్నం వరకూ మెజార్థ కోసం పావులు కదిప చివరకు సక్సెస్ కావడంతో కొమురయ్య పేరును మేయర్ ప్రతిపాదించాలని నిర్ణయించుకున్నట్టుగా సమాచారం.

అదే డివిజన్...

బీజేపీ నాయకులు పదో డివిజన్ నుండి బరిలో నిలిపిన డి శంకర్ ను మేయర్ చేయాలని భావించింది. అయితే ఆ పార్టీ టికెట్ ఆశించిన కొమురయ్యకు చివరి నిమిషంలో ఆశాభంగం కావడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచారు. దీంతో పదో డివిజన్ నుండి గెలిచిన కొమురయ్యే కూటమి పార్టీల మద్దతుతో మేయర్ బాధ్యతలు చేపట్టనున్నట్టుగా స్పష్టం అయింది. బీజేపీ అనుకున్నట్టుగా పదో డివిజన్ అభ్యర్థిని గెలవకపోయినప్పటికీ అదే డివిజన్ నుండి గెలిచిన కొమురయ్యకు మేయర్ గా మద్దతు లభించడం విశేషం.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఫార్వర్డ్ బ్లాక్, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు

- కాంగ్రెస్ కు ఎంఐఎం కార్పొరేటర్ల సంపూర్ణ మద్దతు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 15: కరీంనగర్ చెందిన ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్లతోపాటు ముగ్గురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు విప్పల సాయి జ్యోతి, బొట్ల శ్యామల కాంగ్రెస్ గూటికి చేరారు. వీరితోపాటు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు సొగాని కొమరయ్య, ఆకుల నందిని ఉదయ్, పర్వతం మల్లేశం సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరిని మంత్రులు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎంఐఎం కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మజీదు హుస్సేన్ మంత్రుల సమక్షంలో ఆ పార్టీ జిల్లా నేత గులాం అహ్మద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన పేదలందరికీ అందిస్తామని వారు పేర్కొన్నారు.

"

యూఎస్ తో ట్రేడ్ డీల్‌తో కేంద్రం రైతులకు ద్రోహం చేస్తోందని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు అర్ధరహితం. రాహుల్ అబద్ధాలు వ్యాప్తి చేస్తూ రైతులను తప్పదారి పట్టిస్తున్నారు. రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను పూర్తిగా రక్షిస్తున్నాం. ఆందోళన చెందాల్సిన పని లేదు. రైతుల గురించి పార్లమెంటులో రాహుల్ మాట్లాడుతుంటే నవ్వొస్తోంది.

- కేంద్ర మంత్రి అమిత్ షా

ప్రాంతీయం

ఏడుపాయల దుర్గమ్మ సేవలో మెదక్ ఎస్పీ దంపతులు..

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 15: శివరాత్రి పర్వదినాన్నిపురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ మాత ఆలయాన్ని కుటుంబ సమేతంగా మెదక్ జిల్లా ఎస్పీ డివి. శ్రీనివాస రావు ఆదివారం సందర్శించారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు.శివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలపై ఎస్పీ అధికారులతో చర్చించారు. క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భక్తులు శాంతియుతంగా అమ్మవారిని దర్శనం చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రజలకు ఎస్పీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

జన సముద్రమైన ఏడుపాయల

- పట్టు వస్త్రాలు సమర్పించినా ఎమ్మెల్యే
- దర్శించుకున్న జిల్లా అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి15: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గామాత ఆలయ మహా శివరాత్రిని పురస్కరించుకొని వైభవంగా ఏడుపాయల జాతర ఉత్సవాలు మొదలయ్యాయి ఉదయమే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం అలంకరణ సహస్రనామకుకుంకుమ అర్చనతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించిన అర్చకులు అమ్మవారిని భక్తుల దక్షణార్థం ఉదయం నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శివాని దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు ముందుగా ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ఆలయ అధికారులు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే రోహిత్ రావ్ శివాణి దంపతులకు శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంజీరా నదిలోని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్న జాతరకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున భక్తులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సేవలు అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ ఆలయ ఈఓ వీరేశం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్ ఆలయ సిబ్బంది, ఆలయ పూజారులు, పాపన్నపేట కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహా శివరాత్రి పురస్కరించుకొని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వన దుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ దంపతులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు వనదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దంపతులకు ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు తీర్థ ప్రసాదాలను అందించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మహా జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్, త్రాగునీరు, విద్యుత్, పరిశుభ్రత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. భక్తులందరూ మూడు రోజులు పాటు జరిగే జాతరలో ప్రశాంతంగా దర్శనాలు , ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. అనంతరం ఉచిత మహిళా బస్సును కలెక్టర్ ప్రారంభించారు. బస్టాండ్ నుండి ఆలయం వరకు ఉచిత బస్సులో ప్రయాణించారు కలెక్టర్ దంపతులు సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం బస్టాండ్ నుండి జాతరలో బస్సు తిరిగేందుకు ఏర్పాటు చేయడం జరిగింది . ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో. జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్.ఆలయ కమిటీ ఈవో వీరేశం. డిఎస్పి ప్రసన్నకుమార్ ఆలయ అధికారులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఏడుపాయలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా ఆలయ అధికారులు జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లను చేశారు మంజీరా నదిలో భక్తుల స్థానాల కోసం గదులను ఏర్పాటు చేయడమే కాక షవర్లను ఏర్పాటు చేశారు వన దుర్గ మాత ప్రాజెక్టు వద్ద చెక్ డాం ల వద్ద గజ ఈతగాలను ఏర్పాటు చేశారు భక్తులు ఎవరు కూడా అనారోగ్యానికి గురికాకుండా అత్యతుల సేవలు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నడుమ జాతర కొరసాగుతుంది జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో వాటి పర్యవేక్షణలో అదనపు ఎస్పీ మహేందర్ పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు జేబుదొంగలతో జాగ్రత్త ఎవరి వస్తువులు వారే జాగ్రత్తగా చూడాలని మైకు ద్వారా ప్రజలకు తెలుపుతున్నారు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భక్తుల విశ్వాసాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పోలీసు అధికారు లకు సూచించారు

జాతర బందోబస్తును పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 15: ఏడుపాయలలో మహాశివరాత్రి జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆదివారం పరిశీలించారు.వనదుర్గభవాని అమ్మవారి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేయాలని, పాసులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పించాలని ఆదేశించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, వృద్ధులు, మహిళలు మరియు చిన్నపిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జాతర పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర నిఘా కొనసాగించాలని, సీసీటీవీ కెమెరాలు మరియు కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షించాలని అన్నారు. డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

- ప్రత్యేక ఆకర్షణగా సాంప్రదాయ నృత్యాలు

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 15: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ ప్రాంతాల్లో ఆదివాసీ, బంజారా సమాజ ఆధ్యాత్మిక మార్గదర్శి శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఆదివారం నాడు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు రంగోలీలు వేసి, వీధులను జెండాలు, పతాకాలతో అలంకరించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు భక్తి గీతాలు ఆలపించగా, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి ఉత్సాహాన్ని జోడించారు. ర్యాలీని చూసేందుకు ప్రజలు రహదారుల వెంట నిలబడి అభినందనలు తెలిపారు.ర్యాలీ అనంతరం జరిగిన సభలో బంజారా పెద్దలు మాట్లాడుతూ 18వ శతాబ్దంలో జీవించిన ఆయన బంజారా, లంబాడీ సమాజాలకు ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేసి ఐక్యత, నిజాయితీ, అహింస వంటి విలువలను బోధించారు అన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకం. ఆయన చూపిన దారిని అనుసరిస్తేనే సమాజం అభివృద్ధి తోపాటు మన ఆత్మగౌరవం, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు, చిన్న, పెద్ద పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వర స్వామి కళ్యాణం

ప్రతిపక్షం, గజ్వేల్,(వర్గల్) ఫిబ్రవరి 15: మహాశివరాత్రి ఉత్సవంలో భాగంగా వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు ఆదివారం నాడు సభ మండపంపై రాజరాజేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవముగా అర్చక స్వాములు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి బెల్లంకొండ రంగాచారి మరియు ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కైలాసేశ్వర స్వామికి ప్రత్యేక పూజ

- పాల్గొన్న టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు
- ఆలయ నిర్మాణానికి 4, కోట్ల 60 లక్షలు నిధులు మంజూరు

ప్రతిపక్షం,దౌల్తాబాద్, ఫిబ్రవరి 15 :దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట, గాజులపల్లి గ్రామంలో ఉన్న దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కైలాసేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు, ఉప్పల్ ఎమ్మెల్యే బండ లక్ష్మారెడ్డి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకం, పుష్పార్చన, మహామంగళహారతి నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలపై చర్చించారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌ను బి ఆర్ నాయుడు ను సన్మానించి శివుని మెమెంటో అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ. దొమ్మట గాజులపల్లి లో 500 ఏళ్ల క్రితం చేసిన పురాతన ఆలయం పునర్ నిర్మాణం జరుగుతున్న దక్షిణ కాశీ కైలాసే రేశ్వర ఆలయా నిర్మాణానికి రూ. 4 కోట్ల 60 మంజూరు చేశారు. కార్యక్రమంలో గాజుల పల్లి సర్పంచ్ స్వామి, దొమ్మట మాజీ సర్పంచ్ వెంకట రెడ్డి,ఉపసర్పంచ్ ప్రేమ్ కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



దేశంలో రాజకీయ స్థిరత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. కొన్నేళ్లుగా 38 దేశాలతో 9 ట్రేడ్ డీల్స్ చేసుకున్నాం. టెక్స్‌టైల్స్, లెదర్, కెమికల్స్, హ్యాండ్‌క్రాఫ్ట్స్, జువెల్లరీ వంటి రంగాల్లో ఎంఎస్ఎంఈ మార్కెట్ విస్తరించింది. ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. యూపీఏ హయాంలో ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేక ఏ దేశంతోనూ చర్చించలేకపోయింది.

- ప్రధాని నరేంద్ర మోడీ

చైర్మన్ పోటీలో ఆ ముగ్గురు

- ఉద్యమకారులకా, పార్టీ విధేయులకా?

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 15: నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రమైన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పీఠం (చైర్మన్) అధిష్టించేది అత్యధిక స్థానాలు సాధించుకున్న రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ అయినా! చైర్మన్ పీఠం అధిష్టించేది ఎవరా! అని మున్సిపల్ ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న దినం నేటితో తెరపడునుంది. అయితే పార్టీ నుండి ప్రధానంగా తెలంగాణ ఉద్యమ కాలం నాటి నుండి పనిచేసిన వ్యక్తి కుటుంబానికా! లేదా ఉద్యమ స్ఫూర్తితో బారాసలో చేరి పార్టీ వెన్నంటి ఉన్న మరో ఇద్దరు వ్యక్తులలో ఒకరికా అనే సందేహం త్వరలో వీడనుంది. అసలు విషయానికి వస్తే టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాడు ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్న వ్యక్తి (కళ్యాణ్ కార్ నర్సింగ్ రావు) తెలంగాణ నినాదంతో తన వంతు బాధ్యతగా రాష్ట్ర సాధనలో జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాలు నిర్వహించి తర్వాత తెరాసలో చేరి చురుగ్గా పాల్గొన్నారు. దీంతో ఆ వ్యక్తి సతీమణి కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు (బిఆర్ఎస్) గతంలో ఓడినా నేడు కౌన్సిలర్ గా విజయం సాధించి పార్టీ, మాజీ మంత్రి ఆశీస్సులతో సీనియర్ గా చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉండి పార్టీ విధేయులుగా పనిచేస్తు గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రతాపరెడ్డి ఆశీస్సులతో చైర్మన్ పీఠం తమకే దక్కుతుంది అని గంగిశెట్టి చందన రవీందర్ లు ఉండగా, గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశించిన ఖరారు కాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా ఓడిన నేడు బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉంటూ తన భార్య బొగ్గుల స్వప్న సురేష్ ను మెజార్టీతో కౌన్సిలర్ గా ఎన్నిక కాబడ్డాడు. దీంతో తనకే చైర్మన్ పీఠం దక్కుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉపాధ్యక్ష పదవిలో ప్రజ్ఞాపూర్, ఆర్ అండ్ ఆర్ కాలనీ ల నుండి ఎన్నికైన వారిలో లేదా బిఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారు కాక స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి గెలుపొందిన అత్తిలి శ్రీనివాస్ తనకే వరిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మరో నాలుగు గంటల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పీఠం అధిపతి ఎవరో తెలుస్తుంది. ఏది ఏమైనా పటికి నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర రావు ఖరారు చేసిన అభ్యర్థికి చైర్మన్, వైస్ చైర్మన్ పీఠం దక్కుతుందని తెలుస్తోంది.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

- మార్కండేయ ఆలయంలో భజన క్లబ్బింగ్ కార్యక్రమం



ప్రతిపక్షం, సిద్దిపేట, ఫిబ్రవరి 15: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధిపేట శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జిల్లా కేంద్రంలోని ఉమా పార్థివ కోటి లింగేశ్వర ఆలయం, శరభేశ్వర ఆలయం, భోగేశ్వర ఆలయం, గౌరీ నీలకంఠేశ్వర, మార్కండేయ ఆలయాలలో భక్తులు శివున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. శివరాత్రి పర్వదినాన శివునికి అభిషేకం చేసి పూజిస్తే అంతా మంచే జరుగుతుందనే నమ్మకంతో భక్తులు శివరాత్రి రోజున ఎక్కువ మంది దర్శించుకుంటారు. భక్తుల తాకిడికి అనుగుణంగా పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివరాత్రి జాగరణ సందర్భంగా ఈ రోజు రాత్రి నుండి తెల్లవారే వరకు పలు ఆలయాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మార్కండేయ దేవాలయంలో భజన క్లబ్బింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దీప్తి నాగరాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కాముని రాజేశం , సభ్యులు గుండు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

క్షీణించిన ఇమ్రాన్ ఆరోగ్యం.. ఆస్పత్రికి తరలింపు

ఇస్లామాబాద్: పాక్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను జైలు అధికారులు దగ్గర్లోని ఒక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అధికారిక ప్రకటన లేనప్పటికీ.. పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) పార్టీ నేతలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఇమ్రాన్ ఖాన్ అనారోగ్యంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగష్టు నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనను కలిసేందుకు ఇటీవల కుటుంబ సభ్యులను కూడా అనుమతించడం లేదు. ఆయన అనారోగ్యం పాలయ్యారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కంటి చూపు చాలా వరకు కోల్పోయారని, అలాగే జైలులో ఆయనపై పలు రకాల దాడులు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. కానీ, దీనిపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత రాలేదు. ఇదే సమయంలో ఇటీవల ఇమ్రాన్ ఆరోగ్యం బాగా క్షీణించిందని ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఆయనను తాజాగా ఒక ఆస్పత్రికి రహస్యంగా తరలించి చికిత్స అందిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని అధికారులు చెప్పలేదు. ఎవరికీ తెలియకుండా చికిత్స అందించడంపై ఇమ్రాన్ స్థాపించిన పీటీఐ పార్టీకి చెందిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో కావాలనే పాక్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆయన ప్రాణానికే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ఇమ్రాన్‌కు ఏ చికిత్స అందించినా ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో, ఫ్యామిలీ డాక్టర్ సమక్షంలోనే అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఖాన్ ఆరోగ్య స్థితిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడ లేదు. తనకు కనీస వసతి సౌకర్యాలు కల్పిస్తే చాలని ఆయన ఇటీవల జైలులో కోరినట్లు తెలుస్తోంది.



విశ్వ వీక్షణం

దేశ ప్రయోజనాల కోసమే ఇంధన విధానం

- భారత విదేశాంగ శాఖమంత్రి జైశంకర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: భారత ఇంధన విధానంపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతులపై భారత్ వైఖరని ఆయన ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు. తమ ఇంధన విధానం దేశ ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అమెరికాతో ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందం తర్వాత జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా జరుగుతున్న సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ కామెంట్స్ చేశారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, దేశాల మధ్య భాగస్వామ్యాలు మారినా భారత్ తన స్వతంత్ర నిర్ణయాధికారాన్ని వదులుకోలేదని జైశంకర్ తేల్చిచెప్పారు. భారత్ ఎప్పటికీ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికే కట్టుబడి ఉంటుందన్నారు. అమెరికాతో కుదిరిన ఇటీవలి వాణిజ్య ఒప్పంద ప్రభావం రష్యా భారత్ ఇంధన సంబంధాలపై ఉంటుందా అన్న అన్న ప్రశ్నకు జైశంకర్ స్పందించారు. స్వయం ప్రతిపత్తి అనేది భారత పరిణామ క్రమంలో ఒక భాగంగా ఉందని జైశంకర్ అన్నారు. తమ దేశంలో రాజకీయాలకు అతీతంగా ఈ నిర్ణయానికి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అందుకే భారత్ దీనికి కట్టుబడి ఉంటుందని చెప్పారు. అలాగే, ప్రస్తుతం ఉన్న మార్కెట్ అనిశ్చితుల నేపథ్యంలో అన్ని లెక్కలను సరిచూసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అందరు భాగస్వాములను సంతృప్తిపర్చడం సాధ్యం కాదని ఆయన అమెరికాను ఉద్దేశించి పరోక్ష కామెంట్స్ చేసారు. గతేడాది రష్యా నుంచి చమురు దిగుమతుల కారణంగా భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలను ట్రంప్ విధించారు. అయితే, ఇటీవల ప్రధాని మోదీతో జరిగిన చర్చల తర్వాత ఆ సుంకాలను రద్దు చేస్తూ వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని అమెరికా నేతలు ప్రకటనలు చేసారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆ దేశ మంత్రి రూబియో కూడా రష్యా మార్కెట్ నుంచి భారత్ తప్పుకుంటుందని చెప్పారు. కానీ, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సైతం అమెరికా వాదనలను కొట్టిపారేశారు. భారత్ అటువంటి హామీ ఏదీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. తాజాగా జైశంకర్ చేసిన వ్యాఖ్యలు రష్యా మంత్రికి మద్దతుగా చేసినట్టు ఉన్నాయి. రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లను ఆపేది లేదని ఆయన ప్రపంచ వేదికపై నిర్మొహమాటంగా చెప్పారు.

తారిఖ్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా

- ఇండియా తరపున హాజరు కానున్న లోక్ సభ స్పీకర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బంగ్లాదేశ్ వెళ్లనున్నారు. అక్కడ ఈ నెల 17న బంగ్లా ప్రధానిగా తారిఖ్ రహమాన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఓంబిర్లా దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీఎన్‌పీ అధికారం చేజిక్కించుకుంది. ఈ పార్టీ తరపున తారిఖ్ రహమాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా ఎన్నికకానున్నారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 17న జరగనుంది. ఈ వేడుకకు పలు దేశాలకు చెందిన నేతలను బంగ్లా ప్రభుత్వం ఆహ్వానించింది. మన ప్రధాని నరేంద్ర మోదీకి కూడా బంగ్లా ఆహ్వానం పంపింది. ఢాకాలో జరిగే రహమాన్ ప్రమాణ స్వీకారానికి అతిథిగా హాజరుకావాలని కోరింది.



అయితే, అదే రోజు ప్రధాని మోదీకి వేరే కార్యక్రమం ఉంది. ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుయెల్ మ్యాక్రాన్ ఇండియాలో పర్యటించనున్నారు. ఆయనను 17న మోదీ ముంబైలో కలుస్తారు. ఇది చాలా రోజుల క్రితమే ఫిక్సైంది. అందువల్ల మోదీ.. బంగ్లాదేశ్ వెళ్లలేరు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమానికి ఇండియా ప్రతినిధిగా, అధికారికంగా హాజరవుతారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. రహమాన్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా హాజరు కావడం ఇరు దేశాల సంబంధాలకు, ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడుతోందని, బంగ్లాకు భారత ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందని కేంద్రం తెలిపింది.

గవర్నర్ ను దూషించిన డీఎంకే నేతకు మూడేళ్ల జైలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఫిబ్రవరి 14: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరపు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.

పొత్తుల్లేవ్.. సొంతంగా గెలుస్తాం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఫిబ్రవరి 14: తమిళనాడు లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాలు మొదలుపెట్టాయి. అక్కడ సాధారణంగా డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. కానీ రాబోయే ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి. ప్రముఖ నటుడు విజయ్ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడమే ఇందుకు కారణం. తమిళగ వెట్ర కళగం పార్టీని స్థాపించిన విజయ్... అధికార డీఎంకేను కూల్చడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. పొత్తులపై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో రెండు ప్రధాన జాతీయ కూటములైన ఎన్డీయే, యూపీయేతో పొత్తు పెట్టుకోబోమని, స్వతంత్రంగానే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. తమ పార్టీ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ శక్తిగా అవతరిస్తుందని, సంప్రదాయ పార్టీలైన రెండు వ్యతిరేక పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఆవిర్భవిస్తుందని ఆయన చెప్పారు.

21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం ఇప్పుడు డిజిటల్ బాట పట్టింది. మన న్యాయ వ్యవస్థ కూడా కాలంతో పాటు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. సోషల్ మీడియా న్యాయం అనేది వ్యవస్థకు ఒక తోడ్పాటుగా (Complementary) ఉండాలి తప్ప, చట్టానికి ప్రత్యామ్నాయం కాకూడదు. న్యాయం అందరికీ అందాలి.. కానీ అది కేవలం ఆవేశంతో కూడిన తీర్పు కాకుండా, చట్టబద్ధంగా, మానవీయంగా ఉండాలి. అపారమైన డిజిటల్ శక్తితో పాటే అంతులేని బాధ్యత కూడా వస్తుంది. ఆ బాధ్యతను గుర్తించి, సమాజ హితం కోసం సోషల్ మీడియాను ఉపయోగించడం మనందరి కనీస కర్తవ్యం చట్టం తన పని తాను చేసుకుంటూ, ప్రజల చైతన్యం దానికి తోడైనప్పుడే మనం కలలుగనే నిజమైన సామాజిక న్యాయం సిద్ధిస్తుంది.

డిజిటల్ విచారణలు కంచె దాటుతున్న న్యాయం?

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

గడిచిన పదేళ్లలో సోషల్ మీడియా మన జీవనశైలినే మార్చేసింది. ఫేస్బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్స్టాగ్రామ్ వంటి వేదికలు కేవలం కబుర్లు చెప్పుకునే వేదికలుగా మిగిలిపోలేదు, అవి అన్యాయంపై ఎక్కుపెట్టిన శక్తివంతమైన అస్త్రాలుగా రూపాంతరం చెందాయి. అయితే, ఈ సోషల్ మీడియా తీర్పులు మన రాజ్యాంగబద్ధమైన న్యాయ వ్యవస్థకు నిజంగా అద్దం పడుతున్నాయా? లేక కంచె దాటి చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటున్నాయా? నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్నలివే. నిజానికి సోషల్ మీడియా న్యాయం అనేది ప్రజల ఆవేదన నుండి పుడుతుంది. తమకు జరిగిన అన్యాయాన్ని లేదా సమాజంలో చూసిన అక్రమాలను ఒక పోస్ట్ రూపంలోనో, చిన్న వీడియో రూపంలోనో నెట్టింట పంచుకోవడంతో ఈ ప్రక్రియ మొదలవుతుంది. అలా పంచుకున్న కంటెంట్ క్షణాల్లో వైరల్గా మారి కోట్లాది మందిని చేరుకుంటుంది. కేవలం ఒక ట్వీట్ లేదా ఒక పోస్ట్ గంటల వ్యవధిలోనే దేశ వ్యాప్త సంచలనంగా మారి వ్యవస్థలను సైతం ఉలిక్కిపడేలా చేస్తుంది. ఈ డిజిటల్ విప్లవం సృష్టించిన ప్రభావాన్ని మనం ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో కళ్ళారా చూశాం. మన దేశంలోనే ఇందుకు సజీవ సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వేధింపుల ఘటనలు నెట్టింట వెలుగులోకి రావడంతో, వ్యవస్థలు నిద్రలేచి వేగంగా స్పందించిన సందర్భాలు అనేకం. అవినీతి కోరల నుండి, అధికార అహంకారం నుండి సామాన్యుడిని కాపాడటంలో సోషల్ మీడియా ఒక రక్షణ కవచంలా నిలిచింది. ఎక్కడైతే సాంప్రదాయ మీడియా గొంతు నొక్కబడుతుందో, ఎక్కడైతే న్యాయం ఆలస్యమవుతుందో,అక్కడ సోషల్ మీడియా ఒక ఆశా కిరణమై బాధితులకు కొండంత అండగా మారుతోంది సోషల్ మీడియా న్యాయం వెనుక ఉన్న అసలు సిసలైన బలాన్ని మనం తక్కువ అంచనా వేయలేం. ముఖ్యంగా సమాజంలో గొంతు నొక్కబడిన వారికి, అట్టడుగు వర్గాలకు ఇది ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తోంది. ఇన్నేళ్లుగా వ్యవస్థల చుట్టూ తిరిగి విసిగిపోయిన సామాన్యులు, ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఒకప్పుడు సామాన్యుడికి, శక్తివంతుడికి మధ్య ఉన్న అగాధాన్ని ఈ డిజిటల్ విప్లవం పూడ్చేస్తోంది. సామాన్య పౌరుడు ఇప్పుడు నేరుగా అధికార పీఠాలను ప్రశ్నించగలుగుతున్నాడు. సెలబ్రిటీలు, రాజకీయ ఉద్ధండులు, కార్పొరేట్ దిగ్గజాలు, ఎవరైనా సరే, ఇప్పుడు ప్రజల పౌర నిఘా (Public Scrutiny) నుంచి తప్పించుకోవడం అసాధ్యం. బాధ్యతారాహిత్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరినీ జవాబుదారీలుగా నిలబెట్టే శక్తి ఇప్పుడు సామాన్యుడి వేలికొనల్లోనే ఉంది

సాధారణంగా మన న్యాయ వ్యవస్థలో తీర్పులు రావడానికి ఏళ్లు పడుతుంటాయి. కానీ సోషల్ మీడియా పుణ్యమా అని, ఇప్పుడు అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఏదైనా ఒక ఘటన నెట్టింట వైరల్ అయిందా, ఇక గంటల వ్యవధిలోనే అరెస్టులు, విచారణలు జరిగిపోతున్నాయి. వ్యవస్థపై ప్రజలు తెస్తున్న ఈ డిజిటల్ ఒత్తిడి, అడ్మినిస్ట్రేషన్ను పరుగులు పెట్టిస్తోంది. చైతన్యానికి కేరాఫ్ అడ్రస్ గా సామాజిక రుగ్మతలపై గొంతు ఎత్తడంలో సోషల్ మీడియా తిరుగులేని పాత్ర పోషిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన #MeToo వంటి ఉద్యమాలు లైంగిక వేధింపుల వంటి సున్నితమైన అంశాలపై ఇళ్లల్లోనూ, వీధుల్లోనూ చర్చ జరిగేలా చేశాయి. ముసుగు వేసుకున్న నేరస్థుల అసలు రంగును బయట పెట్టడంలో ఇదొక శక్తివంతమైన ఆయుధమైంది.

మరోవైపు వెన్నాడుతున్న చీకటి కోణాలు వున్నాయి అయితే, నాణేనికి రెండో వైపు ఉన్న చేదు నిజాలను కూడా మనం విస్మరించలేం. సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ నిజమేనా? అంటే కాదనే చెప్పాలి. ఒక అబద్ధం వెయ్యి కాళ్లు చేసుకుని క్షణాల్లో ప్రపంచమంతా చుట్టేస్తోంది. ఎడిట్ చేసిన వీడియోలు, కట్టుకథలు, తప్పుడు ఆరోపణలు అమాయకులను సైతం సమాజం ముందు నేరస్థులుగా నిలబెడుతున్నాయి. ఒక్కోసారి ఆ నింద నిజం కాదని తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. సోషల్ మీడియాలో ఒక ఆరోపణ వచ్చిందో లేదో, వేలాది మంది నెటిజన్లు ఒక్కసారిగా ఆ వ్యక్తిపై విరుచుకుపడుతున్నారు. అసలు నిజానిజాలేమిటో తెలుసుకునే ఓపిక ఎవరికీ ఉండటం లేదు. ఫలితంగా, అభివ్యక్తి స్వేచ్ఛ కాస్తా అకస్మాత్తుగా హింసగా, బెదిరింపులుగా రూపాంతరం చెందుతోంది. నేడు మనం చూస్తున్న ఈ క్యాన్సెల్ కల్చర్ (Cancel Culture) పాతకాలపు వీధి తీర్పులకే ఒక ఆధునిక డిజిటల్ రూపం. ఇక్కడ విచారణల కంటే విమర్శలకే ప్రాధాన్యం ఎక్కువ. మన రాజ్యాంగం ప్రకారం, నేరం నిరూపించబడే వరకు ప్రతి ఒక్కరూ నిర్దోషులే . కానీ సోషల్ మీడియాలో సీన్ రివర్స్. ఇక్కడ ఎవరైనా నిందితుడిగా ముద్ర వేయబడ్డారా, ఇక వారికి తమ వాదన వినిపించే అవకాశమే ఉండదు. కోర్టు బోనులో నిలబడకముందే, నెటిజన్ల తీర్పులతో వారి ప్రతిష్ట మంటగలిసిపోతోంది. ఒక్క వైరల్ పోస్ట్ ఆ వ్యక్తి కెరీర్ను, వ్యక్తిగత జీవితాన్ని, ఇన్నేళ్ల గౌరవాన్ని క్షణాల్లో బూడిద చేసేస్తోంది. ఆ తర్వాత అతను నిర్దోషి అని తేలినా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. సోషల్ మీడియా విచారణల్లో తరచుగా బలి అవుతున్నది వ్యక్తుల గోప్యతనే . బాధితులైనా, నిందితులైనా వారి అనుమతి లేకుండా వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, చిరునామాలు నెట్టింట పెట్టడం చట్టరీత్యా నేరం. కానీ, న్యాయం చేస్తున్నామన్న ఆవేశంలో చాలామంది ఈ లక్ష్మణ రేఖను దాటేస్తున్నారు. ఇది ఒక వ్యక్తి ప్రాథమిక హక్కును కాలరాయడమే.

మరి మన న్యాయ వ్యవస్థ ఈ డిజిటల్ తుపానును ఎలా ఎదుర్కొంటోంది? ఇది నిజంగా ఒక జటిలమైన సమస్యే. మన దగ్గర సమాచార సాంకేతిక చట్టం 2000' (IT Act) ఉన్నప్పటికీ, సైబర్ వేధింపులను, అసత్య ప్రచారాలను అరికట్టడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. రోజూ కోట్లాది పోస్టులు ప్రవాహంలా వచ్చి పడుతుంటే, ప్రతిదానిని వడపోసి పర్యవేక్షించడం అసాధ్యమైన పని. గతంలోనే భారత అత్యున్నత న్యాయస్థానం ట్రయల్ బై మీడియా' (Trial by Media) ధోరణిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తీర్పులు కోర్టుల్లో రావాలి కానీ, మీడియా స్టుడియోల్లోనో, సోషల్ మీడియా వాల్స్ పైనో కాదని స్పష్టం చేసింది. న్యాయ ప్రక్రియకు విఘాతం కలిగించేలా సాగే ఈ సమాంతర విచారణలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తాయని సుప్రీంకోర్టు అనేకసార్లు హెచ్చరించింది. హక్కు, బాధ్యత,ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు అని మర్చిపోకూడదు రాజ్యాంగంలోని 19(1)(a) అధికరణం మనకు భావ ప్రకటన స్వేచ్ఛను ప్రసాదించింది. కానీ, ఏ హక్కు కూడా పరిమితులకు అతీతం కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఎంత ఉందో, అంతే బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం కూడా ఉంది. సరిగ్గా ఇక్కడే అసలైన సవాలు ఎదురవుతోంది మనం వాడుతున్న స్వేచ్ఛ ఎదుటివారి హక్కులను హరించనంత వరకే అది గౌరవప్రదం. ఈ విషయం పై ప్రపంచవ్యాప్త మథనం జరుగుతుంది కేవలం మన దేశంలోనే కాదు, సోషల్ మీడియా సృష్టిస్తున్న ఈ అలజడి ఇప్పుడు ప్రపంచవ్యాప్త చర్చనీయాంశమైంది. అమెరికా నుండి ఆసియా దేశాల వరకు, అదుపు తప్పుతున్న ఈ డిజిటల్ విచారణలను అరికట్టేందుకు కొత్త చట్టాల రూపకల్పనలో నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ తీసుకువచ్చిన డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (Digital Services Act) ఒక సంచలనం. తప్పుడు సమాచారాన్ని, విద్వేషపూరిత కంటెంట్ను మొగ్గలోనే తుంచేయాలని, లేదంటే భారీ జరిమానాలు తప్పవని సోషల్ మీడియా దిగ్గజాలను ఇది హెచ్చరిస్తోంది. బాధ్యత ఎవరిది? "అమెరికాలోనూ సెక్షన్ 230 సవరణపై వాడీవేడీ చర్చలు సాగుతున్నాయి. వేదిక కల్పించడమే కాదు, ఆ వేదికపై జరిగే అనర్థాలకు కూడా సోషల్ మీడియా కంపెనీలే బాధ్యత వహించాలనేది దీని ప్రధాన ఉద్దేశ్యం. మరి ఈ డిజిటల్ న్యాయం కంచె దాటి చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోకుండా ఉండాలంటే మనం ఏం చేయాలి?

కేవలం స్మార్ట్‌ఫోన్ వాడటం తెలిస్తే సరిపోదు. సోషల్ మీడియాను బాధ్యతగా ఎలా ఉపయోగించాలో ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా నేటి యువతకు అవగాహన కల్పించాలి. కంటికి కనిపించే ప్రతి పోస్ట్ వెనుక ఉండే నిజాన్ని, అబద్ధాన్ని వేరు చేసి చూసే విజ్ఞతను పెంపొందించాలి (డిజిటల్ అవగాహనా (Media Literacy) నిజానిజాల నిలదీత (Fact Checking) తప్పనిసరి ఏదైనా సమాచారాన్ని కేవలం ఒక్క క్లిక్' తో వందల మందికి పంపే ముందు అది నిజమేనా అని ఒక్క క్షణం ఆలోచించాలి. వాస్తవాలను నిర్ధారించే సంస్థలు (Factcheckers), బాధ్యతాయుతమైన జర్నలిస్టులు ఈ విషయంలో ప్రజలకు దిక్సూచిలా నిలవాలి. ఒక అబద్ధం ప్రచారం కాకుండా ఆపడం కూడా ఒక రకమైన సామాజిక సేవయే. కేవలం లాభాలే పరమావధిగా కాకుండా, సోషల్ మీడియా సంస్థలు సామాజిక బాధ్యతను కూడా నెత్తినేసుకోవాలి. హానికరమైన కంటెంట్ను, విద్వేషపూరిత పోస్టులను క్షణాల్లో గుర్తించి తొలగించేలా అత్యాధునిక కృత్రిమ మేధ (AI) సాంకేతికతను వాడాలి. అరాచకానికి వేదిక కాకూడదన్నదే ఈ సంస్థల లక్ష్యం కావాలి. సైబర్ నేరాలను అరికట్టేందుకు మనకు పదునైన చట్టాలు కావాలి. అయితే ఆ చట్టాలు పౌరుల గొంతు నొక్కేలా కాకుండా, వారి స్వేచ్ఛను కాపాడే కవచంలా ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా, మన అసలు సిసలైన న్యాయ వ్యవస్థలో వేగం పెరగాలి. కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసులు నలుగుతుండటమే, సామాన్యుడిని ఆవేదనతో సోషల్ మీడియా వీధి తీర్పుల వైపు నెట్టేస్తోంది. న్యాయం ఆలస్యమైతే అది అన్యాయంతో సమానం అన్న మాట ఇక్కడ అక్షర సత్యం. సోషల్ మీడియా న్యాయం చట్టాన్ని మించిపోతుందా? ఈ ప్రశ్నకు అవుననో, కాదనో ఒక్క మాటలో సమాధానం చెప్పలేం. కొన్నిసార్లు ఇది న్యాయానికి దారి చూపే దిక్సూచిగా మారుతుంటే, మరికొన్నిసార్లు చట్టాన్ని కాలరాసే జన సమూహంగా (Mob) అవతరిస్తోంది. ఇక్కడ మనకు కావాల్సింది సమతుల్యత. సోషల్ మీడియాలోని అనంతమైన శక్తిని సామాజిక ప్రయోజనం కోసం వాడుకుంటూనే, అది సృష్టించే ప్రమాదాలను ఆదిలోనే అడ్డుకోవాలి. పటిష్టమైన చట్టాలు, జవాబుదారీతనంతో కూడిన వేదికలు, విజ్ఞత గల పౌరులు, ఈ ముగ్గురూ కలిసినప్పుడే నిజమైన డిజిటల్ న్యాయం సాధ్యమవుతుంది. 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం ఇప్పుడు డిజిటల్ బాట పట్టింది. మన న్యాయ వ్యవస్థ కూడా కాలంతో పాటు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. సోషల్ మీడియా న్యాయం అనేది వ్యవస్థకు ఒక తోడ్పాటుగా (Complementary) ఉండాలి తప్ప, చట్టానికి ప్రత్యామ్నాయం కాకూడదు. న్యాయం అందరికీ అందాలి.. కానీ అది కేవలం ఆవేశంతో కూడిన తీర్పు కాకుండా, చట్టబద్ధంగా, మానవీయంగా ఉండాలి. అపారమైన డిజిటల్ శక్తితో పాటే అంతులేని బాధ్యత కూడా వస్తుంది. ఆ బాధ్యతను గుర్తించి, సమాజ హితం కోసం సోషల్ మీడియాను ఉపయోగించడం మనందరి కనీస కర్తవ్యం చట్టం తన పని తాను చేసుకుంటూ, ప్రజల చైతన్యం దానికి తోడైనప్పుడే మనం కలలుగనే నిజమైన సామాజిక న్యాయం సిద్ధిస్తుంది.



నో షేక్ హ్యాండ్!

భారత్, పాకిస్థాన్ మెగా పోరులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. గతంలో లాగే ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్ యాదవ్, సల్మాన్‌అలీ ఆగా పాత సంప్రదాయాన్నే కొనసాగించారు. మ్యాచ్‌కు ముందు టాస్ వేసే సమయంలో కనీసం ఒకరిని ఒకరు చూసుకోని కెప్టెన్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకుండానే వెనుదిరిగారు. ఇటీవల జరిగిన ఆసియాకప్‌లోనూ రెండు దేశాల సారథులు ఇదే ఒరవడి కొనసాగించారు. టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా.. భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు కరచాలనం లేకుండానే డగౌట్‌కు చేరుకున్నారు.

సూపర్ భారత్..
పాకిస్తాన్‌పై ఘన విజయం

ఫార్మాట్ ఏదైనా ప్రపంచకప్ టోర్నీల్లో దాయాది పాకిస్థాన్‌కు చుక్కలు చూపెట్టే టీమ్‌ఇండియా.. ఆ సంప్రదాయాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ మరోసారి విజయ దుందుభి మోగించింది. ఇరుజట్ల మధ్య కొలంబో ఆతిథ్యమిచ్చిన గ్రూప్‌ఏ మ్యాచ్‌లో భారత్.. 61 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించి సూపర్ 8 బెర్తును ఖరారు చేసుకుంది. అదీగాక ఐసీసీ టీ20 టోర్నీల్లో పాక్‌పై భారత ఆధిపత్యాన్ని 8 1కు పెంచుకుంది. మ్యాచ్‌లో పాక్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77, 10 ఫోర్లు, 3 సిక్సలు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32, 3 ఫోర్లు) నిలకడైన ఆటతో 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 175 రన్స్ చేసింది. ఛేదనలో భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో పాక్ 18 ఓవర్లకు 114 రన్స్‌కు తోకముడిచింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా షాహిన్ అఫ్రిది (19 బంతుల్లో 23 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆడకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. హార్దిక్ (2/16), బుమ్రా (2/17), వరుణ్ (2/17), అక్షర్ (2/29) తలా రెండు వికెట్లు పడగొట్టి పాక్ పనిపట్టారు. ఇషాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఇషాన్ మినహా మిగిలిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడిన పిచ్‌పై పాక్ బ్యాటర్లు ఎలా స్పందిస్తారు? అన్న ఉత్కంఠకు తొలి మూడు ఓవర్లలోనే తెరపడింది. పవర్ ప్లేలోనే పాక్ ఓటమి దాదాపుగా ఖాయమైంది. హార్దిక్, బుమ్రా, అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టు తొలి 6 ఓవర్లలో టాపార్డర్‌ను కోల్పోయి ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హార్దిక్ తొలి ఓవర్లోనే ప్రమాదకర సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను డకౌట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్‌లో బంతినందుకున్న బుమ్రా.. ఐదు బంతుల వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడగొట్టి దాయాదిని చావు దెబ్బ కొట్టాడు.రెండో బంతికి అయూబ్ (6)ను అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో వికెట్ల ముందు బలిగొన్న అతడు.. ఆఖరి బంతికి కెప్టెన్ సల్మాన్ (4)ను బోల్తా కొట్టించాడు. ఐదో ఓవర్‌లో అక్షర్.. బాబర్ ఆజమ్ (5)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఆ జట్టు పవర్ ప్లేలో 38/4తో నిలిచింది. ఈ క్రమంలో పాక్‌ను కీపర్ ఉస్మాన్ ఆదుకునే యత్నం చేశాడు. దూకుడుగా ఆడుతూ భారత స్పిన్నర్లను ఎదుర్కొన్న అతడు.. షాదాబ్ ఖాన్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. కానీ అక్షర్ 11వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. అంతే..! ఆ తర్వాత పాక్ లోయరార్డర్ తోకముడవడానికి పెద్దగా టైమ్ పట్టలేదు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. పాక్ పనిపడతాడనుకున్న అభిషేక్ శర్మ వికెట్‌ను ఫస్ట్ ఓవర్లోనే కోల్పోయింది. పాక్ సారథి వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని పుల్ చేయబోయి మిడాన్‌లో అఫ్రిదికి చిక్కాడు. అభిషేక్ గండాన్ని తప్పించుకున్నామని సంబరపడ్డ పాక్ ఆశలపై ఇషాన్ నీళ్లు చల్లాడు. షాహిన్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేట ఆరంభించిన అతడు.. అబ్రర్ ఐదో ఓవర్లో 6, 4 బాదాడు. అతడే వేసిన ఏడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో అతడి అర్ధశతకం కూడా పూర్తయింది. దూకుడుగా ఆడే క్రమంలో ఇషాన్‌ను 9వ ఓవర్లో అయూబ్ బౌల్డ్ చేయడంతో 87 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇషాన్ నిష్క్రమణ తర్వాత భారత స్కోరు వేగం తగ్గింది. పాక్ సారథి వరుసగా స్పిన్నర్లతో వేయించి టీమ్‌ఇండియా భారీ స్కోరుకు అడ్డుకట్ట వేయగలిగాడు. తిలక్, సూర్య క్రీజులో ఉన్నా సింగిల్స్, డబుల్స్‌కే పరిమితమయ్యారు. అయూబ్ ఒకే ఓవర్లో తిలక్, హార్దిక్‌ను ఔట్ చేసి షాకిచ్చినా ఆఖర్లో శివమ్ దూబె (17 బంతుల్లో 27, 3 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (11) మెరుపులతో భారత్ 170 పరుగుల మార్కును దాటేసింది.

వెస్టిండీస్ విజయం..
టోర్నీ నుంచి నేపాల్ ఔట్

టీ20 ప్రపంచకప్‌లో రెండు సార్లు చాంపియన్ వెస్టిండీస్ సూపర్ 8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖెడే వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించి ఈ టోర్నీలో సూపర్ 8కు క్వాలిఫై అయిన తొలి జట్టుగా నిలిచింది. విండీస్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 రన్స్ చేసింది. దీపేంద్ర సింగ్ (47 బంతుల్లో 58, 3 ఫోర్లు, 3 సిక్సలు) మినహా మిగిలినవారంతా క్రీజులో నిలవడానికే తంటాలు పడ్డారు. విండీస్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జేసన్ హోల్డర్ (4/27) నాలుగు వికెట్ల ప్రదర్శన చేయగా హోసెన్, ఫోర్డ్, జోసెఫ్, ఛేజ్ చెరో ఒక వికెట్ తీశారు. కరీబియన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి నేపాల్‌పై ఒత్తిడి పెంచడంతో ఆ జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం ఛేదనకు వచ్చిన విండీస్.. కెప్టెన్ షై హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సలు), షిమ్రన్ హిట్‌మైర్ (32 బంతుల్లో 46 నాటౌట్ , 4 ఫోర్లు, 2 సిక్సలు) మెరుపులతో 15.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది. గ్రూప్‌సీలో భాగంగా లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన వెస్టిండీస్.. 6 పాయింట్లతో సూపర్ 8 బెర్తును ఖాయం చేసుకుంది. నేపాల్ మూడింట్లో మూడూ ఓడి రేసు నుంచి నిష్క్రమించింది.

రామ్ చరణ్ సమక్షంలో ఘనంగా బుచ్చి బాబు బర్త్‌డే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఈ రోజు దర్శకుడు బుచ్చి బాబు సానా పుట్టినరోజు వేడుకని 'పెద్ది' షూటింగ్ లొకేషన్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ , దర్శకుడు బుచ్చి బాబును ప్రత్యేకంగా సన్మానించారు. టీమ్ సభ్యులందరి సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజును గ్రాండ్ గా సెలబ్రేట్ చేశారు. 'ఉప్పెన'తో బ్లాక్‌బస్టర్ డెబ్యూ అందుకున్న బుచ్చిబాబు సానా, భావోద్వేగంతో కూడిన గ్రామీణ కథనాల ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సిగ్నేచర్ స్టైల్‌ను కొనసాగిస్తూ, 'పెద్ది' ను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ ఇంటెన్స్, రగ్గడ్ లుక్‌లో పాన్ ఇండియా ఆడియన్స్‌ని అలరించబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన గ్లింప్స్, 'చికిరి చికిరి' ఫస్ట్ సాంగ్‌కు సెన్సేషనల్ రెస్పాన్స్ రావడంతో ప్రాజెక్ట్‌పై హైప్ మరింత పెరిగింది. శరవేగంగా ముందుకు సాగుతున్న ఈ యాక్షన్ డ్రామా ఈ సమ్మర్‌లో గొప్ప ఎమోషన్స్ తో కూడిన మాస్ ఎంటర్‌టైనర్‌గా ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుంది.

'ఇరుముడి' ఫస్ట్ లుక్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ తన ల్యాండ్‌మార్క్ 77వ ప్రాజెక్ట్ 'ఇరుముడి' కోసం సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పాన్‌ఇండియన్ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ కొలాబరేషన్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయ్యింది. రవితేజ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన స్పందన లభించింది. ఈరోజు, మహా శివరాత్రి శుభ సందర్భంగా, మేకర్స్ హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రియా భవానీ శంకర్‌ను కావేరీగా పరిచయం చేశారు. రవితేజ రగ్గడ్ లుక్‌లో ఆమె చెంపపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించగా, ఇద్దరి మధ్య ఉన్న ఆప్యాయతను పోస్టర్ అందంగా చూపిస్తోంది. ఫుల్ బియర్డ్, క్యాజువల్ స్ట్రైప్డ్ షర్ట్‌తో గ్రామీణ నేపథ్యంలో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలిచింది. మరోవైపు సంప్రదాయ మారూన్ చీరలో ప్రియా భవానీ శంకర్ సహజమైన చిరునవ్వుతో ఆకట్టుకుంటున్నారు. పూలతో అలంకరించిన జుట్టు, మినిమల్ జ్యువెలరీ ఆమె రూరల్ పాత్రకు మరింత అందాన్ని తెచ్చాయి. అరటిపళ్లతో నిండిన బండి బ్యాక్‌డ్రాప్‌లో ఎర్తీ టోన్స్, సాఫ్ట్ లైటింగ్‌తో ఈ పోస్టర్ ఒక మనసుని హత్తుకునే గ్రామీణ ప్రేమకథను సూచిస్తోంది. శివ నిర్వాణ ఇంటెన్స్, ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. ముఖ్యంగా తండ్రి -కూతురు అనుబంధం ఈ చిత్రానికి హైలెట్ గా ఉండబోతుంది. రవితేజ గత సినిమాలకంటే భిన్నంగ కొత్త ఎమోషనల్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో ప్రతి పాత్రను బలంగా తీర్చిదిద్దారు. బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీకి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్. కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌ను శివ నిర్వాణే అందించగా, నరేష్‌బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గా పని చేస్తున్నారు.

అందాల 'రాశి' భక్తిపాట

మహా శివరాత్రి పర్వదినాన దేశవ్యాప్తంగా శివ కీర్తనలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఇక మహా దేవుడిపై తాజాగా రాశీ ఖన్నా పాడిన పాట ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. శివుడిపై తనకున్న భక్తిని చాటుకునేలా రాశీ ఖన్నా ఈ పాటను ఆలపించారు. భారత దేశ వ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న రాశీ ఖన్నా ప్రస్తుతం శివ భక్తితో ఆడియెన్స్‌కి మరింత దగ్గరయ్యారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకున్న రాశీ ఖన్నా ప్రస్తుతం శివుడిపై తన భక్తిని చాటుకునేలా పాటను పాడి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. తాను పాడిన పాటకు వస్తున్న ప్రశంసలపై రాశీ ఖన్నా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. "శివ్ కైలాషోం కే వాసి' అనేది అహంకారాన్ని నాశనం చేయడం, అంతరంగాన్ని మేల్కొల్పడం, అతీంద్రియత శక్తి అయిన అయిన మహా దేవుడి మీద భక్తిని చాటే ప్రార్థనగా నిలుస్తుంది. 'మహా శివరాత్రి' అత్యంత పవిత్రమైన పర్వదినం కావడం, ఇలాంటి ఓ విశిష్టమైన రోజున పాట పాడటం ఎంతో ఆనందంగా ఉంది' అని రాశీ తెలిపారు. ఈ పాటలో రాశీ కనిపించిన తీరు, ఆమె వినయం, పలికించిన భావోద్వేగాలు అందరినీ ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆమె స్వరం సైతం ఎంతో వినసొంపుగా, వినడానికి మనసుకు ఎంతో హాయిగా అనిపించేలా ఉంది. ఆమె పాడుతున్న విధానంలో ఒక నిశ్శబ్ద ప్రకాశం, ప్రశాంతత ఉంది. ఇదొక భక్తిపూర్వకమైన నిజాయితీ ప్రదర్శనలా కాకుండా ప్రార్థనలా అనిపిస్తుంది. అక్షయ్ కుమార్‌తో ప్రస్తుతం రాశీ ఖన్నా ఓ ప్రాజెక్ట్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతితో కలిసి 'ఫర్జీ 2', విక్రాంత్ మాస్సేతో కలిసి 'తలఖోన్ మే ఏక్', ఆర్. మాధవన్‌తో కలిసి 'థ్రిల్లర్ బ్రిడ్'తోజ్ అనే చిత్రాలు చేస్తున్నారు. ప్రస్తుతం "శివ్ కైలాషోన్ కే వాసి" ద్వారా రాశీ ఖన్నా అభిమానుల్లో మరింత పదిలమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200